శ్రీ క్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘమాసం, బహుళపక్షం షష్ఠి: తె. 4-34 తదుపరి సప్తమి; స్వాతి: పూర్తి; వర్జ్యం: ఉ. 11-47 నుంచి 1-34 వరకు; అమృత ఘడియలు: రా. 10-27 నుంచి 12-13 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8-46 నుంచి 9-32 వరకు; తిరిగి రా.10-58 నుంచి 11-48 వరకు; రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు సూర్యోదయం: ఉ.6.29; సూర్యాస్తమయం: సా.5.58

# సిటీ టైమ్స్

తెలుగు దినపత్రిక

### 'కోడ్' అమలులో లేని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులివ్వండి..

**హైదరాబాద్:** కొత్త రేషన్ కార్డుల జారీకి వెంటనే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ అధికారులతో జరిపిన సమీక్షలో కీలక ఆదేశాలు జారీ చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున.. ఈ కోడ్ అమలులో లేని జిల్లాల్లో వెంటనే రేషన్ కార్డులు జారీ చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కొత్త కార్డులకు సంబంధించి పలు డిజైన్లను సీఎం పరిశీలించారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొత్త వారితో పాటు కార్డులు ఉన్నవారు సైతం కొత్తగా సభ్యులను చేర్చేందుకు దరఖాస్తులు చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు.

మంగళవారం- 18- ఫిబ్రవరి 2025 | సంపుటి : 25 సంచిక : 235 | పేజీలు - 8 వెల : రూ 3 | www. citytimes news.com



## ఆ భూముల్లో ఇకపై నిర్మాణాలు చేపట్టొద్దు

### తెలంగాణ హైకోర్టు

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో కమ్మ, వెలమ, విశ్వబలిజ కాపు సంఘాలకు కేటాయించిన భూముల్లో ఇకపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవేళ ఇప్పటికే నిర్మాణాలు చేపట్టి ఉన్నట్లయితే అవి తుది తీర్పునకు లోబడి ఉంటాయని గతంలోనే ఉత్తర్వులున్నాయనీ.. వీటితోపాటు ఇకపై ఎలాంటి నిర్మాణాలు, చేపట్టరాదని వెలమ, కమ్మ, విశ్వబలిజ కాపు సంఘాలకు ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో కమ్మ, వెలమ సంఘాల కమ్యూనిటీ భవనాలకు ఐదెకరాలు, విశ్వ బలిజ కాపు సంఘం కమ్యూనిటీ భవనానికి ఆరెకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం వేర్వేరు జీవోలు జారీ చేసింది. ఈ జీవోలపై రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, న్యాయవాది సుంకర నరేష్ వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన ధర్మాసనం

(మిగతా 2 లో)

# 'స్థానిక' సన్నాహాలు

## పోలింగ్ కేంద్రాల గుర్తింపు.. ప్రచురణ

### ఎన్నికలెప్పుడు వచ్చినా... సంసిద్ధమైన పీఆర్, ఎస్ఈసీ

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మరో మూడు నెలల సమయం పట్టే అవకాశమున్నా, ఎన్నికల పనుల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) పూర్తిస్థాయిలో నిమగ్నమైంది. శనివారం జిల్లాలు, మండల స్థాయిలో పోలింగ్ కేంద్రాలను గుర్తించి దానికి సంబంధించిన జాబితాలను జిల్లా, మండల కేంద్రాల్లో ప్రచురించారు. రాష్ట్రవ్యాప్తంగా 570 జెడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీ స్థానాల్లో పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు ప్రకటించారు. మరోవైపు ఓటర్ల జాబితాకు సంబంధించిన కసరత్తు సాగుతోంది. ఎన్నికలు వాయిదా పడుతున్నాయనే భావనలో ఉండొద్దని, ఆయా పనులకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తూనే ఉండాలని అధికారులు, సిబ్బందికి పంచాయతీరాజ్ కమిషనరేట్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, సిబ్బందికి శిక్షణ తదితరాలన్నీ పూర్తిచేసి, ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్ వచ్చినా వెంటనే ఎన్నికల విధుల్లో దిగేందుకు సిద్ధంగా ఉండాలని ఈ ఆదేశాల్లో స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఎన్నికల ఏర్పాట్లపై జెడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఇతర క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌లు, గూగుల్‌మీట్‌లు నిర్వహిస్తూనే ఉన్నారు.

(మిగతా 2 లో)



## రాబోయే మూడు నెలలు అత్యంత కీలకం

సీఎం రేవంత్ రెడ్డి
కలెక్టర్లతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్‌లో తగిన ఆదేశాలు
టెలీమెట్రీ పటిష్టతకు సీఎం సూచనలు
శ్రీశైలం, సాగర్ జలాల వినియోగంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి
నిర్ణీత కోటా కంటే ఏపీ ఎక్కువ తీసుకోకుండా టెలీమెట్రీతో అడ్డుకోవచ్చు



**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** రాబోయే మూడు నెలలు అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వేసవి నేపథ్యంలో సాగు, తాగునీరు, విద్యుత్ డిమాండ్ పెరుగుతుందన్నారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా కలెక్టర్లు చొరవ చూపాలన్నారు. కలెక్టర్లతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్‌లో తగిన ఆదేశాలు

( మిగతా 2లో)

## బయోమెట్రిక్‌తో నకిలీ ఓటర్ల గుర్తింపు

ఎక్కడి నుంచైనా ఓటుపై ఏకాభిప్రాయం అవసరం
ప్రవాసుల రిమోట్ ఓటింగ్‌కు సమయమిదే
సీఈసీ రాజీవ్ కుమార్ వ్యాఖ్యలు
నేడు పదవీ విరమణ

02



## నకిలీ పురుగు మందుల విక్రేతలపై పీడీ యాక్ట్

అగ్రోకెమికల్స్ సంఘం ప్రతినిధులతో తుమ్మల

02





## ఎన్నికల సంఘం సారథిగా జ్ఞానేశ్ కుమార్

02

ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి
ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ సిఫార్సు
రాష్ట్రపతి ఆమోదం

## కాంగ్రెస్ నుంచే బీసీ ముఖ్యమంత్రి అవుతాడు

### టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఏదో ఒక రోజు కాంగ్రెస్ నుంచి ఒక బీసీ ముఖ్యమంత్రి అవుతాడన్నారు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్. ఈ ఐదేళ్లు రేవంత్ రెడ్డే తెలంగాణకు సీఎంగా ఉంటారని వ్యాఖ్యానించిన మహేష్ గౌడ్.. ఏదో ఒక రోజు తెలంగాణ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రిని కూడా చూస్తామన్నాను. అది కూడా కాంగ్రెస్ నుంచే బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతాడని వ్యాఖ్యానించారు. అదే సమయంలో కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్.. ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడటం కరెక్టా

(మిగతా 2 లో)



## రాష్ట్రంలో 'కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో, ఊడుతుందో'

### బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**కరీంనగర్,(సిటీ టైమ్స్):** కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్..మేధావులారా.. బాకీల సర్కార్‌ను బండకేసి బాదండి' అంటూ బీజేపీ కేంద్రమంత్రి బండిసంజయ్ పిలుపునిచ్చారు. కరీంనగర్ బీజేపీ మండలాధ్యక్షులతో నిర్వహించిన టీచర్ ఎమ్మెల్సీ సమావేశంలో బండి సంజయ్ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి తీరును చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో,

( మిగతా 2లో)



## కేసీఆర్ మళ్లీ సీఎం కావాలన్నది ప్రజల ఆకాంక్ష

### భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** తెలంగాణ జాతికి మాజీ సీఎం కేసీఆర్ హీరో అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కేసీఆర్ 71వ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ భవన్‌లో వేడుకలు నిర్వహించారు. 71 కిలోల భారీ కేక్‌ను కేటీఆర్, భారాస నేతలు కట్ చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడారు. "కేసీఆర్.. తెలంగాణ కారణజన్ముడు. ఆయన మళ్లీ సీఎం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు గట్టిగా పనిచేద్దాం. రానున్న మూడున్నరేళ్లు 60 లక్షల గులాబీ దండు.. ఇదే లక్ష్యంతో ముందుకెళ్లాలి" అని కేటీఆర్ పిలుపునిచ్చారు.



## సేద్యంలోనే కోటిన్నర మందికి ఉపాధి

రాష్ట్ర ప్రజల తలసరి వార్షిక ఆదాయం రూ.3.56 లక్షలు
రాష్ట్ర గణాంకాల నివేదిక2024లో వెల్లడి

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):** వ్యవసాయ రంగమే రాష్ట్ర ప్రజలకు జీవనాడిగా ఉంది. రాష్ట్ర ప్రజల్లో అత్యధిక శాతం మందికి సేద్యమే ఉపాధి కల్పిస్తోంది. కోటిన్నర మంది వ్యవసాయంలోనే ఉపాధి పొందుతున్నారని 'రాష్ట్ర గణాంకాల నివేదిక2024'లో అర్థ, గణాంకశాఖ వెల్లడించింది.

( మిగతా 2లో)

# 'స్థానిక' సన్నాహాలు



(మొదటి పేజీ తరువాయి)

**ఎస్ఈసీ ఆదేశాలకు అనుగుణంగా...**

ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఎస్ఈసీ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా పీఆర్ శాఖ ద్వారా పోలింగ్ కేంద్రాల జాబితా, ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. పైగా సిబ్బందికి కూడా దీనికి సంబంధించిన శిక్షణను కూడా పూర్తి చేసింది. శనివారం పోలింగ్ స్టేషన్లు ఖరారు కావడంతో టీ-పోల్ యాప్‌లో పోలింగ్ కేంద్రాల వారీగా 500 నుంచి 700 ఓటర్లను మ్యాపింగ్ చేసి ఆయా కేంద్రాలకు కేటాయించాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్లు ఇతర అంశాలకు సంబంధించి హైకోర్టులోనూ కేసు విచారణ సాగుతున్న విషయం తెలిసిందే. కోర్టుకు ఆయా విషయాలపై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని, జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పీఆర్ శాఖ ఆదేశించింది. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఏవి ముందు నిర్వహించాల్సి వచ్చినా, అందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమై ఉండాలని సూచించింది. కులగణనలో రెండోవిడతలో వివరాల సేకరణ, పరిశీలన, ఆపై కేబినెట్ భేటీలో సమగ్ర నివేదిక ఆమోదం, ఆపై అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు చట్టబద్ధత కల్పించేలా బిల్లు పెట్టి కేంద్రానికి, పార్లమెంట్‌కు పంపించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు మరికొన్ని నెలల సమయం పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## బయోమెట్రిక్‌తో నకిలీ ఓటర్ల గుర్తింపు



**దిల్లీ:** పోలింగ్ స్టేషన్లవారీ ఓటింగ్ ప్రక్రియలో గోప్యతను కాపాడటానికి కొన్ని బూత్‌లలోని ఓట్లను కలిపి లెక్కించే వ్యవస్థ అవసరమని, ప్రవాస భారతీయులు తాము్న ప్రదేశాల నుంచే ఓటింగ్‌లో పాల్గొనే సాధికారత కల్పించేందుకు సరైన సమయమిదేనని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. కోట్ల మంది వలస కార్మికులు ఎక్కడి నుంచైనా తమ ఓటు హక్కును వినియోగించుకునే విషయంలో ఏకాభిప్రాయం అవసరమని స్పష్టం చేశారు. నకిలీ ఓటర్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలింగ్ బూత్‌లలో బయోమెట్రిక్ నిర్ధారణను అమల్లోకి తేవాలని సూచించారు. మంగళవారం పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో సోమవారం దిల్లీలో తనకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల వ్యయాలకు సంబంధించిన వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రారంభమైందని, దానిని తప్పనిసరి చేయాలని రాజీవ్ కుమార్ సూచించారు. దీనివల్ల పారదర్శకతతోపాటు విశ్లేషణకు అవకాశం కలుగుతుందని వెల్లడించారు. నియంత్రణలేని సోషల్ మీడియా ప్రపంచవ్యాప్తంగా ఎన్నికలకు ప్రమాదంగా మారిందని, దానిని ఎదుర్కొనే చర్యలను సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని అభిప్రాయపడ్డారు.



## ఆ భూముల్లో ఇకపై నిర్మాణాలు చేపట్టొద్దు

విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం కుల సంఘాలకు నామమాత్రపు ధరకే భూమిని కేటాయించిందన్నారు. ఇందులో నిర్మాణాలు జరగకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని, ఆ జీవోలను కొట్టివేయాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రభుత్వ వివరణ కోరుతూ విచారణను మార్చి 7కు వాయిదా వేసింది.

## కాంగ్రెస్ నుంచే బీసీ ముఖ్యమంత్రి అవుతాడు

అని ప్రశ్నించారు మహేష్‌గౌడ్. దశాబ్దాలు దేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణలో ఒక్క బీసీ వ్యక్తిని కూడా ఎందుకు ముఖ్యమంత్రిని చేయలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించిన సంగతి తెలిసిందే. శనివారం నల్లగొండ బీజేపీ కార్యాలయంలో మాట్లాడిన కిషన్‌రెడ్డి.. తెలంగాణలో ఇప్పటివరకూ బీసీ వ్యక్తిని ఎందుకు ముఖ్యమంత్రిగా చూడలేకపోయామనే కోణాన్ని లేవనెత్తుతూ.. అందుకు కాంగ్రెస్ పార్టీనే కారణమని విమర్శించారు. దీనికి బదులుగా టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ నుంచి బీసీ వ్యక్తిని సీఎంగా చూస్తామన్నారు.






## నకిలీ పురుగు మందుల విక్రేతలపై పీడీ యాక్ట్

**హైదరాబాద్:** నకిలీ పురుగు మందుల విక్రేతలపై పీడీ యాక్ట్ విధించి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జాతీయ అగ్రోకెమికల్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌కు వచ్చి సచివాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల వారితో మాట్లాడుతూ.. "రాష్ట్రంలో పురుగు మందుల క్రయవిక్రయాలు, నిల్వల సమాచారం కోసం ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తాం. విక్రేతలకు లైసెన్సుల విధానాన్ని ఆన్‌లైన్ చేశాం. ప్రస్తుతం రాష్ట్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏటా 4 వేల పురుగు మందుల నమూనాలను పరీక్షించే సామర్థ్యంతో పని చేస్తున్నాయి. పురుగు మందుల వినియోగాన్ని నియంత్రించే విధంగా వ్యవసాయశాఖతో కలిసి అగ్రోకెమికల్స్ అసోసియేషన్ ప్రతినిధులు పనిచేయాలి" అని మంత్రి కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకుడు గోపి, అగ్రోకెమికల్స్ సంఘం నేతలు ఆర్‌జీ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సంఘం సారథిగా జ్ఞానేశ్ కుమార్



**దిల్లీ:** భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా జ్ఞానేశ్ కుమార్, ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి రెండు గెజిట్ నోటిఫికేషన్లు వేర్వేరుగా విడుదలయ్యాయి. అంతకుముందు ప్రధాని మోదీ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ (ఈసీ) పదవిని చేపట్టబోయే వ్యక్తుల పేర్లను ఖరారు చేసింది. ఈ కమిటీలో ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సభ్యులుగా ఉన్నారు. సీఈసీ, ఈసీ పదవులకు ఎంపిక చేసిన పేర్లను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సిఫార్సు చేయగా ఆమె ఆమోదం తెలిపారు. ఆ వెంటనే అధికారిక ప్రకటనలు వెలువడ్డాయి. ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించి 2023లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం చేపట్టిన తొలి ఎంపికలు ఇవి. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ పదవీకాలం మంగళవారంతో ముగియనుండగా ఎంపిక కమిటీ సోమవారం సాయంత్రం దిల్లీలోని ప్రధాని కార్యాలయంలో సమావేశమైంది. సంప్రదాయం ప్రకారం ఎన్నికల కమిషనర్లలో సీనియర్‌ను సీఈసీగా నియమిస్తుంటారు. దానినే కొనసాగిస్తూ.. రాజీవ్ కుమార్ తర్వాత సీనియర్ అయిన జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీ పదవికి ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. జ్ఞానేశ్ సీఈసీగా బాధ్యతలు చేపట్టనున్నందున ఆయన స్థానంలో ఎన్నికల కమిషనర్‌గా వివేక్ జోషిని ఎంపిక చేశారు. సుఖ్‌బీర్ సింగ్ సంధు ఇప్పటికే మరో ఈసీగా ఉన్న విషయం తెలిసిందే.

## సేద్యంలోనే కోటిన్నర మందికి ఉపాధి



2023-24లో రూ.40.44 లక్షల కోట్ల స్థూల రాష్ట్ర జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ)తో మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలవగా.. రూ.15.01 లక్షల కోట్లతో తెలంగాణ 7వ స్థానంలో ఉంది. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సోమవారం సచివాలయంలో నివేదికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రణాళికాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, డైరెక్టర్ షేక్ మీరా, డిప్యూటీ సీఎం కార్యదర్శి కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో 'కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో, ఊడుతుందో'

(మొదటి పేజీ తరువాయి)

ఊడుతుందో తెలియని పరిస్థితి. కొందరు మంత్రులు ప్రతి పనికి 15 శాతం కమిషన్ దండుకుంటున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ కేబినెట్ మంత్రుల్లో, ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చింది. కుల గణనతో కాంగ్రెస్ కొరివితో తలగొక్కోంటోంది. కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్..నిరుద్యోగులకు 56 వేల నిరుద్యోగ భృతి.2 లక్షల ఉద్యోగాల బాకీ.. ప్రతి విద్యార్థికి 5 లక్షల భరోసా కార్డు బాకీ. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికి స్కూటీ బాకీ. ప్రతి టీచర్లు సహా ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి నాలుగు డీఏలు బాకీ. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రెండో పీఆర్సీ బాకీ. ప్రతి విద్యార్థికి, కాలేజీ యాజమాన్యానికి ఫీజు రీయింబర్స్ మెంట్ బాకీ. ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఓల్డ్ పెన్షన్ స్కీం బాకీ. జీపీఎఫ్‌లో దాచుకున్న డబ్బులు కూడా బాకీ. మేధావులారా..బాకీల సర్కార్‌ను బండకేసి బాదండి. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలవబోతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత తెలంగాణలో అధికారంలోకి వచ్చేదాకా ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించేది బీజేపీదే. బీఆర్ఎస్ పనైపోయింది. అందుకే అభ్యర్థిని కూడా నిలబెట్టలేకపోయింది. కాంగ్రెస్‌తో కుమ్మక్కై బీజేపీని ఓడించాలని బీఆర్ఎస్ చూస్తోంది. బీసీల్లో ముస్లింలను చేర్చి బీసీలను మోసం చేస్తున్నారు. ఇంత జరుగుతుంటే సంఘాలు ఎందుకు స్పందించడం లేదు?.ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ముకాయడమే కుల సంఘాల పనా?' అని బండి సంజయ్ హాట్ కామెంట్స్ చేశారు.

## ఇసుక వాహనాలపై పర్యవేక్షణ పెంచాం.. అక్రమాలపై వాట్సప్‌లో ఫిర్యాదు చేయొచ్చు: శ్రీధర్

**హైదరాబాద్:** నగరానికి వచ్చే అన్ని మార్గాల్లో ఇసుక వాహనాలపై పర్యవేక్షణ పెంచామని తెలంగాణ గనుల శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి 1,529 వాహనాలు పరిశీలించి 129 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. 131 వాహనాలు సీజ్ చేసి.. రూ.26 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీధర్ మాట్లాడారు. "ఇసుక అక్రమ రవాణాపై ఇసుక రీచ్‌ల్లో సిబ్బందితో పర్యవేక్షిస్తున్నాం. హైదరాబాద్ వచ్చే అన్ని మార్గాల్లో ఇసుక వాహనాలపై పర్యవేక్షణ పెంచాం. ఇసుక అక్రమ రవాణా కట్టడికి జిల్లాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. జిల్లాల్లోని అన్ని రీచ్‌ల్లో కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్డీవోల పర్యవేక్షణ ఉంటుంది. గతంలో స్లాట్ల విధానంలో రోజులో 23 గంటలే ఇసుక విక్రయాలు ఉండగా.. సీఎం ఆదేశాలతో 24 గంటల పాటు ఆన్‌లైన్ ద్వారా ఇసుక విక్రయం జరుపుతున్నాం. 25 ఇసుక రీచ్‌ల్లో సీసీ కెమెరాల ద్వారా 24 గంటల పర్యవేక్షణ నిర్వహిస్తున్నాం. రీచ్‌ల్లో పరిస్థితిపై కమాండ్ కంట్రోల్ కేంద్రం, కలెక్టర్ల పర్యవేక్షణ చేస్తున్నాం. ప్రతి రీచ్‌లో నెలన్నరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. ప్రతి రీచ్‌లో వేబ్రిడ్జి, ప్రతి వాహనానికీ జీపీఎస్ ఏర్పాటు చేస్తాం. ఇసుక అక్రమాలపై వాట్సప్, ఫోన్, వీడియోల ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు 98480 94373, 70939 14343" అని శ్రీధర్ సూచించారు.



## రాబోయే మూడు నెలలు అత్యంత కీలకం

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని సూచించారు. మరోవైపు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, పంటలకు నీటి విడుదలపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

**టెలీమెట్రీ పటిష్టతకు సీఎం సూచనలు**

"ప్రాజెక్టుల కింద పంటలకు ప్రణాళిక ప్రకారం నీటిని వదలాలి. ఎండల తీవ్రత దృష్ట్యా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. రాబోయే మూడు నెలలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితులు పరిశీలించాలి. పరిస్థితుల మేరకు పరిష్కార మార్గాలు అనుసరించాలి. శ్రీశైలం, సాగర్ జలాల వినియోగంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి. రెండు రాష్ట్రాల జలాల లెక్కలకు టెలిమెట్రీ విధానమే పరిష్కారం. నిర్ణీత కోటా కంటే ఏపీ ఎక్కువ తీసుకోకుండా టెలిమెట్రీతో అడ్డుకోవచ్చు" అని సీఎం సూచించారు. దీనిపై స్పందించిన అధికారులు.. టెలీమెట్రీ ఖర్చు భరించేందుకు ఏపీ ముందుకు రావాట్లేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. టెలీమెట్రీ అమలుపై కృష్ణా బోర్డుకు లేఖ రాయాలని ఈ సందర్భంగా సీఎం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు ఆదేశాలు జారీ చేశారు. వాటాల పంపిణీ, లెక్కింపు బాధ్యత కేంద్ర జలసంఘానిదేనన్నారు. వాటా కంటే ఎక్కువగా ఏపీ తరలించకుండా చూసే బాధ్యత కేంద్రానిదేనని.. ఏపీ ఏకపక్ష తరలింపుపై కేంద్రానికి ఫిర్యాదు చేయాలని సీఎం ఆదేశించారు.

## కలుషిత నీరు, ఆహారం వల్లే జీబీ సిండ్రోమ్



**అమరావతి:** మహారాష్ట్రలోని పుణెలో గులియన్ బారీ సిండ్రోమ్ (జీబీఎస్) కేసులు అధిక సంఖ్యలో నమోదవడానికి కలుషిత నీరు, ఆహారం కారణమని తేలింది. బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల ప్రభావంతో.. ముఖ్యంగా రోగనిరోధకశక్తి బలహీనంగా ఉన్న వ్యక్తులు ఈ వ్యాధి బారినపడ్డారు. అక్కడ 208 మందిలో అనుమానిత లక్షణాలు కనిపించగా, వైద్య పరీక్షల్లో 181 కేసులు బయటపడ్డాయి. వీరిలో 47 మంది ఆసుపత్రుల్లో చేరగా.. 28 మంది ఐసీయూల్లో, 16 మంది వెంటిలేటర్లపై చికిత్స పొందుతున్నారు. ముగ్గురు ప్రాణాలు విడిచారు. వారి నుంచి సేకరించిన నమూనాల్లో డయేరియాకు కారణమయ్యే 'కంపైలో బ్యాక్టర్ జెజునీ' బ్యాక్టీరియా, నాన్‌పోలియో ఎంటెరో, నోరో వైరస్‌లను గుర్తించారు. పుణెలో జీబీఎస్ కేసులు అధికంగా నమోదు కావడానికి దారి తీసిన కారణాలను అక్కడి వైద్య ఆరోగ్య శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెలుసుకుంది. అక్కడి బాధితులు కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్లే ఈ వ్యాధి బారినపడినట్లు గుర్తించారు.

**కంపైలో బ్యాక్టర్ జెజునీ బ్యాక్టీరియా**


కంపైలో బ్యాక్టర్ జెజునీ బ్యాక్టీరియా ప్రభావానికి గురైనప్పుడు.. డయేరియా, పొత్తికడుపులో నొప్పి, జ్వరం, వాంతులు వంటి లక్షణాలు బయటపడ్డాయి. దానికి బాధితుల రోగనిరోధక వ్యవస్థ ప్రతిస్పందించే క్రమంలో తలెత్తిన సమస్యలే జీబీఎస్ వచ్చేందుకు దోహదం చేశాయి. సాధారణంగా ఏవైనా బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు తలెత్తినప్పుడు రోగనిరోధకశక్తి ఉత్తేజితమై వాటిని ఎదుర్కోవడానికి యాంటీబాడీలను ఉత్పత్తి చేస్తుంది. కొన్ని కేసుల్లో బాధితుల కణజాలాన్నే శత్రువుగా భావించి ఎదురుదాడి చేయడం వల్ల ఆటోఇమ్యూన్ జబ్బులు తలెత్తుతాయి. ఈ పరిస్థితులే గులియన్ బారీ సింద్రోమ్ వచ్చేందుకు దోహదం చేస్తున్నాయి. జన్యుపరమైన కారణాలతో కూడా కొందరు దీని బారినపడే అవకాశం ఉంది. అత్యంత అరుదుగా వ్యాక్సినేషన్లు, శస్త్రచికిత్సలు, గాయాల వల్ల కూడా ఈ తరహా కేసులు నమోదవుతాయి. బాధితుల ఆరోగ్య స్థితికి అనుగుణంగా.. వారి శరీర బరువుకు తగ్గట్లు కిలోకు 2 గ్రాముల చొప్పున ఇమ్యూనో గ్లోబ్యులిన్ ఇంజిక్షన్లు ఇస్తున్నారు.

**రాష్ట్రంలో ఏటా మాదిరిగానే..**

పుణె తరహా పరిస్థితులు రాష్ట్రంలో లేవు. ఇక్కడ ఏటా మాదిరిగానే వేర్వేరుచోట్ల జీబీఎస్ కేసులు నమోదవుతున్నాయి. ప్రత్యేకంగా ఒక ప్రాంతం నుంచి రాలేదు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 17కేసులున్నాయని అధికారులు ప్రకటించారు. విశాఖ కేజీహెచ్‌లో 5, కాకినాడ జీజీహెచ్‌లో4, గుంటూరు జీజీహెచ్‌లో3, అనంతపురం జీజీహెచ్‌లో ముగ్గురు చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు ఇతర ఆసుపత్రుల్లో ఉన్నారు. శ్రీకాకుళం, గుంటూరు జిల్లాల ఆసుపత్రుల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు విడిచారు. మరోవైపు సోమవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన వ్యక్తి జీబీఎస్‌తో గుంటూరు బోధనాసుపత్రిలో చేరారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన వ్యక్తి ఈ వ్యాధి బారినపడినట్లు నెల్లూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి వైద్యులు నిర్ధారించారు. ఈ రెండు కేసులు కలిపితే కేసుల సంఖ్య 19కి చేరింది.

# పార్కులు ప్రభుత్వ భూములను కాపాడాలి






**ప్రజావాణి లో ఆకుల సతీష్ ఫిర్యాదు**

**నిజాం పేట్, సిటీటైమ్స్:** నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతి నగర్ నందు సర్వే నెంబరు **153 154 155 162** ప్రగతి నగర్ లో ఎన్ఎఎన్ కన్వెన్షన్ సెంటర్లో నాలుగు పార్కులు రోడ్లు, ఎమినిటీ స్థలం ఆక్రమణకు గురైందని, అక్రమ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేశారు అని, మల్లంపేట గ్రామం సర్వేనెంబర్ 170 ఒక వ్యక్తి 12 ఎకరాలు ఆక్రమణ చేసి ప్లాట్లుగా మార్చి ప్రజలకు విక్రయిస్తున్నారు అని ఆరోపిస్తూ ఆకుల సతీష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో అక్రమ నిర్మాణాల పై అడిషనల్ కలెక్టర్ కి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. ప్రగతి నగర్ లో పార్కు మూడు ఎకరాలు, ఎమినిటీ స్థలం అర్ధ ఎకరం, రోడ్లు మొత్తం రెండెకరాలు దాదాపు 6 నుండి 7 ఎకరాలు విలువ 150 కోట్లు విలువైన ప్రజలకు చెందాల్సిన పార్కు/ రోడ్డు స్థలాలు ఆక్రమించుకోవడమే కాకుండా దర్జాగా అనుమతులు లేకుండా ఫంక్షన్ హాల్ నిర్మించి వ్యాపారం చేయడం జరుగుతుందని, కనీసం పార్కులు గాని/ రోడ్లు కానీ, ఎమినిటీ స్థలంలో కానీ సామాన్య మానవులు వెళ్లకుండా చుట్టూ మొత్తం కాంపౌండ్ వాల్ నిర్మించుకొని పార్క్ స్థలం కబ్జా పెట్టుకుని ఎన్ ఏ ఎన్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు చెందాల్సిన నాలుగు పార్క్ స్థలాలు ఒక ఎనిమిటి స్థలం 20 వరకు రోడ్ల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేసి పార్కులు రోడ్లు స్వాధీనం చేసుకొని ప్రజలకు వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ సర్వేనెంబర్ 170 మల్లంపేట నందు 44 ఎకరాల ప్రభుత్వ భూమి నందు గత తొమ్మిది సంవత్సరాలుగా ఆక్రమణలు అక్రమ నిర్మాణాలు అపార్ట్మెంట్లు విల్లాలు నిర్మాణం జరిగిందని, దీని నందు అక్రమ నిర్మాణాలను హైడ్రా కొంతవరకు కూల్చివేసినా గత మూడు సంవత్సరాలుగా సర్వే నెంబర్ 170 కొత్తచెరువు ఆనుకొని దాదాపు 12 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని చిన్నచిన్న ప్లాట్లుగా చేసి పేద ప్రజలకు అంటగట్టడమే కాకుండా ప్రస్తుతం కూడా ఈ ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి అని, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి కారణం జాకీర్ అనే వ్యక్తి 20 ఎకరాలు కబ్జా చేసుకుని ప్లాట్లుగా వేసి ప్రజలకు విక్రయిస్తున్నారు అని, ప్రజా సంపద దోపిడి గత మూడు సంవత్సరాలుగా జరుగుతుందని ఆరోపించారు. చివరకు ఈ కబ్జాదారులు మల్లంపేట గ్రామానికి మంచినీరు సరఫరా చేసే బోర్ వెల్ డంపింగ్ యార్డ్ స్థలాన్ని, కత్వ చెరువు కబ్జా చేసుకుని దర్జాగా ఫెన్సింగ్ వేసుకొని స్వాధీనంలోకి తీసుకున్నారు అని తెలిపారు. ఇటు నాలాని కూడా కబ్జా చేసినా రెవెన్యూ అధికారులు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తూ ఉండిపోయారు అని ఆరోపించారు. జాకీర్ అనే వ్యక్తి ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేసి ప్రజలకు అంటకట్టడమే కాకుండా అక్రమంగా నిర్మించిన ఇంటికి తప్పుడు ఇంటి నెంబర్ కేటాయించడమే కాకుండా ఎలాంటి అనుమతులు లేని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలకి విద్యుత్ శాఖ ఏఈ డిఈ సహకారంతో మీటర్లు కరెంటు పోల్స్ రావడం బహు విడ్డూరంగా ఉందన్నారు. అంతేకాకుండా ఈ ప్రభుత్వ స్థలం నందు ప్రస్తుతము జాకీర్ అనే వ్యక్తి దాదాపు 10 నిర్మాణాలు జరుగుతున్న ఎమ్మార్వో చర్యలు తీసుకోకపోవడం అంతే కాకుండా, జాకీర్ అనే వ్యక్తి ప్రభుత్వ స్థలంలో ఎలాంటి మున్సిపల్ అనుమతులు లేకుండా అయిదంతస్తుల భారీ భవనాన్ని నిర్మిస్తున్నా మున్సిపల్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుండా సహకరిస్తున్నారు అని ఆరోపించారు. అదేవిధంగా లక్ష్మి శ్రీనివాస కన్స్ట్రక్షన్ పక్కనే భారీ భవనం హై స్కూల్ వద్ద మరొక భవనం కూడా సర్వేనెంబర్ 170 వస్తున్న ప్రవేట్ సర్వేనెంబర్తో అనుమతులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, జీవో 58,59 రెగ్యులరైజ్ అయిన వారిని వదిలేసి మిగిలిన ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూములను కాపాడి ప్రజా అవసరాలకి వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ రెడ,శ్రీనివాస్ గౌడ్, పాండు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.








## శ్రీ నాగమల్లేశ్వర స్వామి దేవాలయంలోని స్పటిక లింగం ప్రతిష్ఠాపన

**కొలన్ వీరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా మహోత్సవం**

**ముఖ్య అతిథి ఎన్ఎంసి కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి పూజలు**

**నిజాంపేట్,సిటీటైమ్స్:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని శ్రీ హోమ్స్ కాలనీ ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం శ్రీ నాగమల్లేశ్వర స్వామి దేవాలయంలోని స్పటిక లింగము ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో ముఖ్య అతిథులుగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లిఖార్జున్, ప్రవీణ్(లడ్డు), శివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నిజాం పేట్ లో ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరైన రంగరాయ ప్రసాద్**

**నిజాం పేట్, సిటీటైమ్స్:** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 71వ జన్మదిన వేడుకలను సోమవారం నిజాంపేట్ లోని డబుల్ బెడ్ రూముల వద్ద ఘనంగా బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి తో పాటు సీనియర్ నాయకులు సతీష్, కాలనీ నాయకులు రవీంద్ర , సలీం , ఝాన్సీ , షాలిని శర్మ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## వైభవంగా భౌరంపేట్ మల్లన్న జాతర

**మహోత్సవంలో కేపీ వివేకానంద్ పూజలు**

**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:** శ్రీ భ్రమరాంబిక మల్లికాగార్జున స్వామి వారి కృప కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ఆకాంక్షించారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ లో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం, జాతర వైభవోపేతంగా కొనసాగింది. మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంధాలయం సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్,పిఎసి చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, భౌరంపేట్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, దర్శన్ రెడ్డి, మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, మన్నె శేఖర్, చింత మల్లేశ్, వీరేశం గౌడ్, సత్తిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ సంజీవినీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం ప్రతిష్ఠ

**మహోత్సవంలో ప్రత్యేక పూజలు చేసిన కొమిరిశెట్టి**



**శేరిలింగంపల్లి,సిటీటైమ్స్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి లోని శ్రీ సంజీవినీ ఆంజనేయ సహిత వైకుంఠ శ్రీ సీతా రామ నారాయణ స్వామి వారి దేవస్థానం ప్రతిష్ట మహోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాగం జంగయ్య యాదవ్, పరమేష్, రాగం రంగస్వామి, మహాగౌలి ప్రకాష్, టీ మల్లేష్ యాదవ్, మహాగౌలి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్చకులు, సిబ్బందికి వసతి గృహ సముదాయం

**ప్రారంభించిన పిఎసి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:** అర్చకులకు ,సిబ్బందికి వసతి గృహ సముదాయం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ,పిఎసి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ లో గల శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయం ,శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి, షిరిడి సాయి బాబా దేవాలయం ప్రాంగణములో అర్చకులకు ,సిబ్బందికి వసతి గృహ సముదాయం ,అన్న దాన ప్రసాద వితరణ కొరకు స్టోర్ రూమ్ కొరకు నూతనంగా నిర్మించిన వసతి గృహ సముదాయంను ముఖ్యఅతిథిగా పాల్గొన్న పిఎసి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయం ప్రాంగణంలో అర్చకుల కోసం సిబ్బంది కోసం వసతి గృహం నిర్మించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. అర్చకులకు, సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. ఆలయ కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నా అని, ఆలయ అభివృద్ధి లో తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వరరావు ఆలయ కమిటీ సభ్యులు క్రిష్ణారెడ్డి, యాదయ్య, వెంగల్ రెడ్డి,వెంకట రామి రెడ్డి, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.





## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఆగం రాజు ముదిరాజ్

**నిజాంపేట్, సిటీటైమ్స్:** బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కె చంద్ర శేఖర్ రావు 71వ పుట్టినరోజును పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ తెలిపారు. సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ లో కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ కేక్ కట్ చేసి కేసీఆర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు బద్రి, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ జాయింట్ సెక్రటరీ సురేష్, బిసి చందు, సీనియర్ సిటిజన్ సభ్యుడు సుబ్బారావు, కమల్, సురేష్, నిమ్మరాజు, అన్వేష్, కర్ణాకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

**ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేసిన కొమిరిశెట్టి సాయిబాబా**

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పుట్టిన రోజు పండుగగా జరుపుకోవడం ఆనందంగా ఉందని సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తెలిపారు. సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ లోని స్పర్శ హాస్పిటల్లో కార్యకర్తలతో కలిసి పండ్లు పంపిణి చేసిన కొమిరిశెట్టి సాయిబాబా కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నం రాజు, దార్గుపల్లి నరేష్, సతీష్ ముదిరాజ్, జగదీశ్,డాక్టర్ సుదర్శన్, నారాయణ, రమేష్ గౌడ్,బిక్షపతి, యాదగిరి, నరేష్ సింగ్,మధు, పరమేష్, అలీం, ఖాదర్ ఖాన్, మగ్బూల్, బాలమణి, మాధవి, తాహెర్, బురాన్, సయ్యద్ అజీజ్, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ కమిషనర్ ఆదేశాలను సైతం బే ఖాతరు

**శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఎసిపి పనితీరు**

**బరితెగిస్తున్న బిల్డర్లకు అండగా నిలుస్తున్నారా?**

**సిటీటైమ్స్ కథనాలపై స్పందించిన జోనల్ కమిషనర్**

**చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ ఎసిపికి జెడ్సీ ఆదేశాలు**

**పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్న టౌన్ ప్లానింగ్ ఎసిపి**

**ఎసిపి వైఖరి దేనికి నిదర్శనం.. జెడ్సీ ఆదేశాలు కూడా పట్టవా?**

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:** శేరిలింగంపల్లి సర్కిల్ 20లో బరితెగిస్తున్న బిల్డర్లు అని, సర్కిల్ లో అధికారమే లేని అధికారులా ? అనే శీర్షికలతో సిటీటైమ్స్ దినపత్రికలో వరుస కథనాలు ప్రచురించడంతో జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి స్పందించారు. వెంటనే అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం పట్టణ ప్రణాళికా విభాగం (టౌన్ ప్లానింగ్ ఎసిపి) అధికారికి ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ సదరు అధికారి మాత్రం జోనల్ కమిషనర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ గత మూడు రోజులుగా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. స్థానికుల ఫిర్యాదుతో రెండుమార్లు నోటీసులు జారీ చేసిన సదరు అధికారి మూడో సారి నోటీసు ఇవ్వకపోవడంపై వరుస కథనాలు ప్రచురితం కావడంతో జోనల్ కమిషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ ఏ కారణం చేతనో జెడ్సీ ఆదేశాలు అందుకున్న టౌన్ ప్లానింగ్ ఎసిపి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా లేఔట్ లో తెల్లాపూర్ వెళ్లే మెయిన్ రోడ్ లో ప్లాట్ నెంబర్ 193 ఎంఐజి పాత బిల్డింగ్ పై అనుమతులకు విరుద్ధంగా అక్రమ అంతస్తులు నిర్మిస్తున్నారని ఫిర్యాదులు చేసినా, పత్రికలలో ప్రత్యేకించి సిటీటైమ్స్ లో వరుస కథనాలు వెలువడినా చివరకు జోనల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినా కూడా చర్యలు చేపట్టకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా నిర్మాణం చేస్తున్నట్లు బహిరంగంగా కనబడుతున్నా కూడా బరితెగించిన బిల్డర్ కు సహకరించడం వెనుక మతలబు ఏముందో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణమని స్పష్టంగా ఉండటం, రెండు సార్లు నోటీసులు జారీ చేసిన అధికారులు మూడో సారి నోటీసులు ఇచ్చే లోపు సక్రమ నిర్మాణమైందా.. లేకా అధికారుల చేతివాటం ముట్టిందా.. అనే పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జోనల్ కమిషనర్ సైతం ఆదేశాలు జారీ చేశాకా కూడా చర్యలు తీసుకోకపోవడం అంటే అసలు టౌన్ ప్లానింగ్ అధికారులు (ఎసిపి) ఎవరి కోసం పని చేస్తున్నారో తెలియజేయాలని స్థానిక సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జోనల్ కమిషనర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, అధికారులపై ప్రజలకు ఉండే విశ్వాసం నమ్మకాన్ని చాటాలని కోరుతున్నారు.



సిటీటైమ్స్ తెలుగు దినపత్రిక city times Editorial సంపాదకీయం



# డ్రాగన్–ఎలిఫెంట్‌ల సయోధ్య సాధ్యమా?

20వ 'సెంట్రల్ కమిటీ ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా' ప్లీనరీలో, ఉన్నత–ప్రమాణాల సోషలిస్ట్ మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి నాణ్యతా ఆర్థికాభివృద్ధితో అత్యున్నత అత్యాధునిక సోషలిస్ట్ దేశంగా చైనాను రూపొందింపజేయాలని 'డ్రాగన్' సంకల్పించింది. ప్రపంచ ఆర్థిక పురోగతికి 30 శాతానికి మించి దోహదపడుతున్న చైనాలో 2024లో ఆరు నెలల్లోనే 26,870 కొత్త విదేశీ –పెట్టుబడి కంపెనీలు వాణిజ్య రంగంలో అడుగుపెట్టాయి. ఆధునిక సోషలిస్ట్ దేశంగా డ్రాగన్, 'వికసిత భారత్ 2047' లక్ష్యంతో పురోగమిస్తున్న భారత్ రెండూ, 280 కోట్ల జనావళి శ్రేయస్సు దిశలో నడుస్తున్నాయి.

ప్రస్తుతం మన దేశంలోని, ప్రతీ రాష్ట్రం, భారీ కార్పొరేట్ రంగ యాజమాన్యాలు మరింత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల జాయింట్ వెంచర్‌లు, టెక్నాలజీ టై–అప్స్, సమృద్ధిగా ఎగుమతులు సాధించే ఆర్థికాభివృద్ధిని ఆశిస్తున్నాయి. అమెరికా (ట్రంప్ 2.0), చైనా దిగుమతులపై ట్యారిఫ్‌ల పెంపుదల బెదిరింపులు చైనాకు తప్పేటట్టు లేదు. మన ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ కూడా వర్తక వ్యాపార సమతూక నిర్వహణకు చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఆహ్వానించడం సమయోచితంగా సూచించారు. 2025లో భారత్–చైనా దేశాధినేతల పరస్పర సహకార సౌహార్ద బాంధవ్యానికి 2024 అక్టోబర్‌లో బ్రిక్స్, కజాన్ సమావేశం కొంత సానుకూలత కల్పించింది.

2024 నవంబర్‌లో భారత్–చైనా విదేశీ వ్యవహారాల మంత్రులు జైశంకర్, వాంగ్‌యీ కూడా రియో డి జెనీరోలో ద్వైపాక్షిక చర్చలలో పాల్గొన్నారు. ప్రపంచంలో ద్వితీయ ఆర్థిక సంపన్న దేశంగా 2024లో గుర్తింపు పొందింది. 2023లో మన దేశంతో 136.2 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వర్తక, వాణిజ్య భారీ భాగస్వామ్యం పొందింది. మన దేశపు అత్యంత నాణ్యతా ఉత్పత్తులకు చైనాలో ప్రోత్సాహం ఉండనే ఉంది. 2024లో మన దేశపు మిర్చి, ఇనుప ఖనిజం, పత్తి, నూలు చైనాకు ఎగుమతులలో వరుసగా 17 శాతం, 160 శాతం, 240 శాతాలకు పైగా వృద్ధి సాధించాయి. చైనా, అంతర్జాతీయ దిగుమతుల ఎక్స్‌పో వంటి ప్లాట్ ఫారాల పూర్తి వినియోగానికి భారత్‌లోని అత్యంత నాణ్యమైన ఉత్పత్తులను ఆహ్వానిస్తూనే ఉంది.

చైనా – భారత్‌ల మధ్య నెలకొని ఉన్న సరిహద్దు వివాదం శతాబ్దాల సంఘర్షణల నేపథ్యం పరిశీలిస్తే... అంత సులభంగా పరిష్కారం కాదని గ్రహించవచ్చు. రుణప్రదాతగా రాజనీతితో వ్యవహరిస్తున్న బడా చైనా సార్వభౌమ ఆధిపత్యపు కోరలలో చిక్కుకొన్న లావోస్, అంగోలా, 16 సబ్ – సహారా దేశాలు, కాంగో, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, కంబోడియా, నైజీరియా, ఈజిప్ట్ వంటి... మధ్య, స్వల్ప, అల్ప ఆదాయ దేశాలు విలవిలలాడుతున్నాయి. 2017లో శ్రీలంక తన మేజర్ నౌకాశ్రయం హాంబన్ తోటను చైనాకు స్వాధీనం చేయవలసి వచ్చింది. టిబెట్‌లో సియాంగ్ నదిపై (అస్సాంలో బ్రహ్మపుత్రా) అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులలో 60,000 మెగావాట్ ఉత్పత్తి సామర్థ్యం గల ప్రపంచంలోనే అతి పెద్దదైన జల విద్యుత్ కేంద్ర నిర్మాణం తలపెట్టింది.

అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రేమా ఖండూ ఇటీవల జనవరి నెలాఖరులో చైనా అంతర్జాతీయ జల ఒడంబడికలను ఎలా త్రోసిరాజంటున్నదీ చెప్పారు. ఆ భారీ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ భవిష్యత్తులో సృష్టించే పెను పర్యావరణ, ప్రకృతి విధ్వంసాన్ని వివరిస్తూ చైనా వైఖరి పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని చిక్కుముడుల మధ్య డ్రాగన్–ఎలిఫెంట్ సయోధ్య సాధ్యమా?

# అన్నదొకటి... అయ్యిందొకటి!

కాలక్రమంలో వాడుకలో ఉన్న కొన్ని పదాలు అర్థం కోల్పోతాయని, పైగా వాటికి పూర్తి విరుద్ధమైన అర్థాలు పుట్టుకొస్తాయని ప్రముఖ రచయిత జార్జ్ ఆర్వెల్ అంటారు. 8 ఏళ్ల క్రితం 'ఒకే దేశం ఒకే పన్ను' అన్నది లక్ష్యంగా, చక్కని సరళతరమైన పన్ను (గుడ్ అండ్ సింపుల్ టాక్స్ - జీఎస్‌టీ) గా చెప్ప బడిన 'జీఎస్‌టీ' (గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్) క్రమంగా తన అర్థాన్ని మార్చుకొంది. 2017 జూలై 1న ఎన్డీఏ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీఎస్‌టీ చిన్న, సన్నకారు వ్యాపారుల సమస్యలను తీర్చకపోగా వారికి అనేక చిక్కుముళ్లను తెచ్చి పెడుతోంది.

జీఎస్‌టీ అమలులోకి వచ్చాక దేశంలో పన్ను వసూళ్లు గణనీయంగా పెరిగిన మాట వాస్తవం. ఏటా దాదాపు 8 నుంచి 11 శాతం పైబడి జీఎస్‌టీ వసూళ్లలో వృద్ధిరేటు కనబడుతోంది. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే వస్తు సేవల వినియోగం పెరుగుతుంది.

దాంతో సహజంగానే పన్ను వసూళ్ల మొత్తం పెరుగుతుంది. ఇపుడు జరుగుతున్నది అదే! ఒక దశాబ్ద కాలంలో దేశస్థూల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ప్రజల తలసరి ఆదాయమూ హెచ్చింది. కనుక కేవలం జీఎస్‌టీ అమలు కారణంగానే పన్ను ఎగవేతలు తగ్గాయని, కేంద్రం చెబుతున్నట్లు జీఎస్‌టీ వల్ల దేశంలో 'పన్ను ఉగ్రవాదం' సమసిపోయిందని చెప్పడం అర్ధసత్యమే. దేశంలో 8 ఏళ్ళుగా అమలవుతున్న జీఎస్‌టీ వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని పలు వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. కానీ, వాటిని పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదు. సరళతరమైన పన్నుగా జీఎస్‌టీని చెప్పుకోవడం వరకు బాగానే ఉంది గానీ, ఆ పన్ను రేట్లు, వివిధ శ్లాబులలోకి వచ్చే వస్తువులు, సేవల విషయంలో కేంద్రం, రాష్ట్రాల నడుమ ఇంకా ఏకాభిప్రాయం కుదరకపోవడం గమనార్హం.

ముఖ్యంగా, రాష్ట్రాలకు అతి పెద్ద ఆదాయ వనరులుగా ఉన్న పెట్రోల్, డీజిల్, మద్యం వంటి వాటిని జీఎస్‌టీ పరిధిలోకి చేర్చడానికి మెజార్టీ రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికి 50కి పైగా సమావేశాలు జరిపినప్పటికీ పలు అంశాలపై కేంద్రం, రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు.

**చిక్కుముళ్లు**

జీఎస్టీ అమలులో అనేక చిక్కుముళ్లు ఉన్నాయి. ఇందులో పన్ను రేట్ల హేతుబద్ధీకరణ ప్రధానమైనది. జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతాలుగా పన్ను రేట్లు ఉన్నాయి. 1400 పైబడిన వస్తువులు; 500 రకాల సేవలను ఈ 4 శ్లాబులలో సర్దుబాటు చేశారు. భారీ కసరత్తు అనంతరం రేట్లను ఖరారు చేశామని చెప్పారుగానీ అందులో హేతు బద్ధత, మానవత్వం కనుమరుగయ్యాయన్న విమర్శల్ని సాక్షాత్తూ బీజేపీ నేతలే చేస్తున్నారు.



ఉదాహరణకు జీవిత బీమా (లైఫ్ ఇన్సూ రెన్స్), ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్) ప్రీమియంలపై 18% జీఎస్‌టీ వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తన సహచర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు బహిరంగ లేఖ సంధించడం కలకలం రేపింది. సామాన్యులకు అవసరమైన జీవిత బీమా, ఆరోగ్య బీమాలపై 18% జీఎస్‌టీ వేయడం వల్ల... వారందరూ జీవితం, ఆరోగ్య రక్షణకు దూరం అవుతారని గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారు.

ఇక, శ్లాబుల విషయంలో స్పష్టత లోపించడం వల్ల చెల్లింపుదారులకు, వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య వివాదాలు తలెత్తి చివరకు అవి న్యాయస్థానాలకు చేరుతున్నాయి. అలాగే, కోవిడ్ ప్రబలిన 2020, 2021 సంవత్సరాలలో రాష్ట్రాలకు కేంద్రం అందించిన ఆర్థిక సహకారాన్ని తిరిగి రాబట్టుకొనేందుకు 'సెస్సు' విధించి ప్రజలపై అదనపు భారాన్ని మోపింది. ఈ సెస్సును ఉపసంహరించుకోవాలన్న అభ్యర్థనను సైతం కేంద్రం పెడచెవిన పెట్టింది.

జీఎస్‌టీ పరిధిని క్రమంగా విస్తరిస్తూ పోతున్నారు. శ్లాబ్‌లను మారుస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులపైన, ప్రాణాలు నిలబెట్టే ఔషధాలపైన కనిష్ఠంగా 5% జీఎస్‌టీని మాత్రమే వేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తు న్నారు. వెన్న, నెయ్యి, పాలు వంటి పాల ఉత్పత్తుల పైన, ప్యాకింగ్ చేసిన కొబ్బరి నీళ్లు, పండ్ల రసాల పైన 18% జీఎస్‌టీ విధించడం ఏవిధంగానూ సమర్థనీయం కాదు. చివరకు పెన్నులపైన కూడా జీఎస్‌టీ విధిస్తున్నారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన 55వ జీఎస్‌టీ మండలి సమావేశంలో... పిల్లలు ఎక్కువగా ఇష్టపడే పాప్ కార్న్‌పై 3 రకాల జీఎస్‌టీని విధించడాన్ని ప్రజలు తప్పుబట్టారు.

**ఎంఎస్‌ఎంఈలకు శరాఘాతం**

జీఎస్‌టీ అమలులో స్పష్టత, హేతుబద్ధత లోపించడం వల్ల దెబ్బ తిన్న ప్రధాన రంగాలలో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల రంగం ఒకటి. దేశీయ తయారీరంగంలో దాదాపు 70% మేర ఉద్యోగ కల్పనకు దోహదం చేస్తున్న ఎంఎస్‌ఎంఈ రంగం జీఎస్‌టీ కారణంగా కుదేలైందన్నది ఓ చేదు వాస్తవం. చిన్న చిన్న వ్యాపారాలను జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చాక... అవి చాలా వరకు మూతపడ్డాయి. ముడి సరుకులపై పన్ను విధించడం, మళ్లీ అంతిమ ఉత్పత్తులపై పన్ను వేయడం వల్ల... దేశంలో దాదాపు 20 కోట్ల మంది ఆధారపడిన సూక్ష్మ-మధ్య తరహా పరిశ్రమలకు తీరని నష్టం కలిగింది.

వాటి సప్లయ్ చెయిన్ తెగిపోయిందని ఆ రంగంపై అనేక ఏళ్లుగా జీవనం సాగిస్తున్నవారు మొత్తుకొంటున్నారు. ఒకవైపు వస్తుసేవలను అంతి మంగా వినియోగించుకొనే వారే పన్ను చెల్లించాలని చెబుతూ... మరో వైపు బహుళ పన్నులు వేస్తున్న పరిస్థితి కొన్ని రంగాల్లో ఉంది. వివాదాలు ఏర్పడితే వాటిని పరిష్కరించుకోవడానికి జీఎస్‌టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను అందుబాటులోకి తెచ్చిన మాట నిజమే గానీ... చిన్న వ్యాపారులు ఎంతమంది దానిని ఆశ్రయించగలరు? ఇక, స్థానిక ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఆ యా ఉత్ప త్తులపై పన్నులు విధించే హక్కు గతంలో రాష్ట్రాలకు ఉండేది.

ప్రజలకు జవాబుదారీతనం ఎక్కువగా వహించేది రాష్ట్రాలే. కానీ, రాష్ట్రాలకు తమ ప్రాంత ప్రజల ప్రయోజనాలను పరిరక్షించే అవ కాశం జీఎస్‌టీ వచ్చాక తగ్గిపోయింది. రాష్ట్రాల వినతులకు జీఎస్‌టీ కౌన్సిల్‌లో పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదన్న వాదన ఉంది. జీఎస్‌టీకి సంబంధించి ఏ యే రాష్ట్రాలు ఎన్నెన్ని అభ్యర్థనలు అంది స్తోంది? అందులో వేటికి ఆమోదం తెలుపుతున్నారు? ఎన్నింటిని బుట్టదాఖలా చేస్తున్నారన్న సమాచారాన్ని వెల్లడించడం లేదు.

నిజానికి, తగిన సన్నద్ధత లేకుండా జీఎస్‌టీని అమలులోకి తేవడం వల్ల ఈ సమస్యలు ఉత్పన్నం అయ్యాయి. జీఎస్‌టీ అమలు లోకి వచ్చి 8 ఏళ్లు గడిచాయి. జీఎస్‌టీ మండలి 55 పర్యాయాలు సమావేశమైంది. అయినా అనేక అంశాలు అపరిష్కృతంగానే ఉన్నాయి. జీఎస్‌టీ వసూళ్లల్లో కనబడుతున్న వృద్ధిని చూసి మురిసి పోవడమే తప్ప... ఎదురవుతున్న ఇబ్బందుల్ని సాధ్యమైనంత తొంద రగా పరిష్కరించలేకపోవడం వైఫల్యంగానే పరిగణించాలి. పుట్టుక తోనే లోపాలు ఉన్న బిడ్డగా జీఎస్‌టీని కొందరు అభివర్ణించారు. మరి కొందరు జీఎస్‌టీ వల్ల దేశానికి అసలైన ఆర్థిక స్వాతంత్ర్యం లభించిందంటున్నారు. ఈ రెండూ నిజమే కావొచ్చు. కానీ, అంతిమంగా ప్రజ లకు మేలు జరుగుతున్నదా లేదా అన్నదే కొలమానం. రచయిత జార్జ్ ఆర్వెల్ చెప్పినట్లు కొన్ని పదాలు అర్థం కోల్పోవడమే కాక వాటికి పూర్తి భిన్నమైన అర్థాలు పుట్టుకొస్తున్నాయి. ఇందుకు ఉదాహరణ 'సంస్కరణ' అనే పదం. ప్రపంచీకరణ తర్వాత ఈ పదా నికి అర్థం మారిపోయింది. సంస్కరణ అంటే ఆర్థిక భారంగా ప్రజలు భావిస్తు న్నారు. జీఎస్‌టీ అంశంలో కూడా సరళతరమైన పన్ను అనే భావన పోయి జీఎస్‌టీ అంటేనే మోయలేని భారం అని ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది.

- ☐ జీఎస్‌టీ అమలులోకి వచ్చాక దేశంలో పన్ను వసూళ్లు గణనీ యంగా పెరిగిన మాట వాస్తవం. ఏటా దాదాపు 8 నుంచి 11 శాతం పైబడి జీఎస్‌టీ వసూళ్లలో వృద్ధిరేటు కనబడుతోంది.
- ☐ పుట్టుకతోనే లోపాలున్న బిడ్డగా జీఎస్‌టీని కొందరు అభివ ర్ణించారు. మరికొందరు జీఎస్‌టీ వల్ల దేశానికి అసలైన ఆర్థిక స్వాతంత్ర్యం లభించిందంటున్నారు. కానీ, అంతిమంగా ప్రజ లకు మేలు జరుగుతున్నదా లేదా అన్నదే కొలమానం.
- ☐ చిన్న వ్యాపారాలను జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చాక... చాలా వరకు మూతపడ్డాయి. ముడి సరుకులపై పన్ను విధించడం, మళ్లీ అంతిమ ఉత్పత్తులపై పన్నువల్ల... దాదాపు 20 కోట్ల మంది ఆధా రపడ్డ సూక్ష్మ-మధ్య తరహా పరిశ్రమలకు తీరని నష్టం కలిగింది.

# పవన్ గాలి మళ్లిందా?

ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెరలేపిన కొత్త డ్రామా ఆసక్తికరంగా ఉంది. దక్షిణాదిలోని పుణ్యక్షేత్రాల సందర్శన పేరుతో ఆయన చేస్తున్న యాత్ర భక్తితో చేస్తున్నదా? లేక రాజకీయ ఉద్దేశాలతోనా అన్న చర్చ జోరుగా నడుస్తోంది. భారతీయ జనతా పార్టీ రాజకీయ వ్యూహంలో భాగంగా పవన్ యాత్ర సాగుతోందా? లేక చంద్రబాబు ముందు తన ప్రాధాన్యతను నిరూపించుకునేందుకు ఆయన చేస్తున్నారా? అని కూడా విశ్లేషణలు సాగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా తెలియకుండా పవన్ ఈ యాత్ర చేపట్టడం... ఆయన ఫోన్లకూ స్పందించకపోవడం కచ్చితంగా గమనించదగ్గ అంశాలే. పవన్ బాబుల మధ్య భేటీ జరిగి ఇరవై రోజులవుతోందంటే పరిస్థితి ఏమిటన్నది ఇట్టే అర్థమైపోతుంది. తనకు ఎదురైన అవమానాన్ని, అసమ్మతిని వ్యక్తం చేసేందుకే పవన్ మౌనవ్రతం చేపట్టారా? అన్న అభిప్రాయమూ కొందరు వ్యక్తం చేస్తున్నారు.

తిరుమల లడ్డూ వ్యవహారంలో పవన్ తాను, చంద్రబాబు సమానమే అన్న చందంగా ప్రవర్తించడం టీడీపీకి నచ్చలేదు. ఎల్లో మీడియాలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కథనాలు రావడం ఇందుకు నిదర్శనం. అదే సమయంలో పవన్ ఆయా సందర్భాల్లో చంద్రబాబును ఆకాశానికి ఎత్తేయడం కూడా జనసేనకు అంతగా రుచించలేదు. పవన్ కళ్యాణ్ మరీ అంతగా అణిగిమణిగి ఉండాల్సిన అవసరం లేదన్నది జనసేన కార్యకర్తల అభిప్రాయంగా ఉంది. అంతేకాకుండా.. లోకేష్‌ను ఉప ముఖ్యమంత్రిని చేయాలన్న ఉద్దేశం టీడీపీ నుంచి వ్యక్తం కావడం... దాంతో తమ నేతకు ప్రాధాన్యం తగ్గిపోతుందని, భవిష్యత్తులో లోకేషే ముఖ్యమంత్రి అయితే పవన్ ఎన్నటికీ ఆ స్థానానికి ఎదగలేడని వీరు ఆందోళన చెందారు. ఈ విషయంలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య సోషల్ మీడియా యుద్ధమూ సాగింది. పవన్ అన్న అయిన నాగబాబును మంత్రిని చేయబోతున్నట్లు ప్రకటించి నెలలు గడుస్తున్నా, ఇంతవరకు దాని గురించి చంద్రబాబు మాట్లాడుతున్నట్లు లేరు. ఇది కూడా మిస్టరీగానే ఉంది.

అయితే... తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఇద్దరూ అపచారానికి పాల్పడ్డారనడంలో సందేహం లేదు. లడ్డూ ప్రసాదం తయారీలో జంతుకొవ్వు కలిసిందన్న చంద్రబాబు మాటను పవన్ గుడ్డిగా నమ్మి అదే అబద్ధాన్ని చెప్పడం ద్వారా తప్పులో కాలేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో తొక్కిసలాట జరిగిన సందర్భంలోనూ టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, మంత్రి లోకేష్‌లు అసలు పవన్ కళ్యాణ్ ఎవరన్నట్టుగా వ్యవహరించారు. తొక్కిసలాటకు బాధ్యత వహించి టీటీడీ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్న పవన్ డిమాండ్‌ను తోసిపుచ్చడంతో పవన్ పరువు పోయినట్లయింది. ఆ తర్వాత చంద్రబాబు మంత్రులకు ప్రకటించిన ర్యాంకుల్లో పవన్‌కు పదో స్థానం దక్కడం పుండు మీద కారం చల్లినట్టు అయ్యింది. ఫైళ్ల పరిష్కారంలో వెనుకబడ్డ ప్రాతిపదికన ర్యాంకులిచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే పవన్ అప్పటికే మంత్రివర్గ సమావేశానికి గైర్హాజరైన విషయం అందరి దృష్టిని ఆకర్షించింది. పవన్ నిజంగానే ఏదైనా అనారోగ్యంతో బాధపడుతున్నారేమోలే, అందుకే రాలేదేమోలే అని పలువురు అనుకున్నారు. కానీ చంద్రబాబు కీలకంగా పరిగణించిన ప్రభుత్వ కార్యదర్శుల, మంత్రుల సమావేశానికి కూడా పవన్ రాకపోవడంతో వీరిద్దిరి మధ్య ఏదో గొడవ జరుగుతోందన్న చర్చ మొదలైంది.



ఆ సమావేశంలోనే చంద్రబాబు డిప్యూటీ సీఎం గురించి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆరాతీయగా నడుంనొప్పి వల్ల రాలేకపోయారన్న సమాధానం వచ్చింది. తాను ఫోన్ చేసినా పవన్ అందుబాటులోకి రాలేదని చంద్రబాబు అనడం, ఆ విషయం తెలుగుదేశం పత్రిక ఈనాడులోనే రావడం సంచలనమైంది. టీడీపీ వర్గాలే ఈ సమాచారాన్ని ఎల్లో మీడియాలో వచ్చేలా చేశారా అన్న సందేహమూ వస్తుంది. అంటే పవన్ కళ్యాణ్ సీఎంతో పద్ధతిగా వ్యవహరించలేదన్న సంగతి ప్రజలకు చెప్పాలని అనుకుని ఉండవచ్చు. దానివల్ల భవిష్యత్తులో పవన్ ఏదైనా అనూహ్య నిర్ణయం తీసుకున్నా, తప్పు ఆయన వైపే ఉండేలా చేయడం లక్ష్యంగా కనిపిస్తుంది. ఇందుకు తగ్గట్లే చంద్రబాబు కార్యదర్శుల సమావేశంలో ఫైళ్ల అంశాన్ని ప్రస్తావించి, ఫైళ్ల పరిష్కారానికి ఆరు నెలలు, ఏడాదా అని ప్రశ్నించారు. నిజానికి ఫైళ్లు కేవలం కార్యదర్శులు మాత్రమే క్లియర్ చేస్తే సరిపోదని, మంత్రులు, సీఎం కూడా ఆమోదించాలని చంద్రబాబుకు తెలియంది కాదు. పవన్‌ను ఇరుకున పెట్టడానికి మాత్రమే ఈ సంగతిని ప్రస్తావించారు. గత నెల రోజులుగా పవన్ కళ్యాణ్ పేషీలో వందల కొద్ది ఫైళ్లు పేరుకుపోయాయని చెబుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ ఫైళ్లు ఎప్పుడూ పెద్ద సంఖ్యలోనే ఉంటాయి. విచిత్రం ఏమిటంటే సొంత శాఖలో ఫెయిల్ అయిన పవన్ కళ్యాణ్ ఇతర శాఖలలో జోక్యం చేసుకోవడాన్ని టీడీపీ తెలివిగా వాడుకుంది. దీనిని టీడీపీ ఎక్స్ పోజ్ చేసిందని చెప్పాలి. జనసేన కు చెందిన ఇద్దరు మంత్రులు నాదెండ్ల మనోహర్‌కు, కందుల దుర్గేష్‌కు మంచి ర్యాంకులు ఇచ్చి, పవన్ కళ్యాణ్‌ను పదో ర్యాంకుకు పడవేయడం ద్వారా టీడీపీ ఇవ్వాల్సిన సందేశం ఇచ్చేసినట్లయింది. అంతకు ముందు హోం శాఖ, టూరిజం, సివిల్ సప్లయిస్ మొదలైన శాఖలలో వేలు పెట్టిన పవన్ వల్ల ప్రభుత్వానికి ఇబ్బంది వచ్చింది. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఫెయిల్ అయిన విషయాన్ని, సీజ్ ద షిప్ ఘటనలో ప్రభుత్వ అసమర్థతను టీటీడీ యాజమాన్యం చేతకానీతనాన్ని ఆయన తనకు తెలియకుండానే బయట పెట్టేశారు. మరో వైపు మంత్రి లోకేష్ అన్ని శాఖలపై పెత్తనం చేస్తూ డిఫ్యాక్టో సీఎంగా ఉన్నారన్న భావన ఉంది. ఇది కూడా పవన్ కు నచ్చడం లేదు. తన పేషీలో అధికారులను కూడా లోకేష్ నియమించారని ఆయన ఆగ్రహం చెందినట్లు వార్తలు వచ్చాయి.

ప్రస్తుతం పోలీసు శాఖ మొత్తం లోకేష్ చెప్పినట్లే వింటోందన్న భావన ఏపీ అంతటా ఉంది. ఆ విషయాన్ని నేరుగా ప్రస్తావించకుండా పిఠాపురంలో పోలీసుల పనితీరును, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యథేచ్ఛగా సరఫరా అవుతున్నాయని పవన్ తప్పుపట్టారు. లోకేష్ రెడ్ బుక్ వ్యవహారం కూడా ఏపీలో గందరగోళం సృష్టిస్తోంది. లోకేష్ శైలిపై పవన్ అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం కూడా జరిగింది. ఇవన్నీ ఒక ఎత్తయితే చంద్రబాబుతో కలిసి ఎన్నికలకు ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు, ఎన్నికల ప్రణాళికపై నోరు విప్పలేని పరిస్థితి పవన్‌కు ఏర్పడింది. అసలు ప్రభుత్వంలో ఏమి జరుగుతుందో తెలియని అయోమయంలో పవన్ కళ్యాణ్ ఉన్నారు.

ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ కు ఏమి చేయాలో తోచక ఈ తీర్థయాత్ర పెట్టుకుని ఉండవచ్చని కొందరు భావిస్తున్నారు. అయితే సీఎంకు చెప్పకపోవడం, ఫోన్‌కు కూడా స్పందించకపోవడంతో పాత ఘటనలన్నిటికి ప్రాధాన్యత ఏర్పడింది. నడుం నొప్పి నిజంగానే అంత తీవ్రంగా ఉండి ఉంటే, కేరళ పర్యటనలో ఎక్కడా అలసట లేకుండా తిరుగుతారా అన్న డౌటు వస్తుంది. ఈ పరిణామాలతో ఇప్పటికిప్పుడు టీడీపీ, జనసేనల మధ్య ఏదో జరిగిపోతుందని చెప్పలేం. చంద్రబాబు, పవన్ ల మధ్య ఉప్పు, నిప్పులా పరిస్థితి మారిందని అనలేం. కాకపోతే ప్రభుత్వం ఎంత అధ్వాన్నంగా నడుస్తోంది వెల్లడైంది. పవన్ ప్రస్తుతం పవర్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. ఏదో కొంతకాలం అలిగి, తనకు కావల్సినవి సాధించుకోవడానికి ఏమైనా ఇలా చేస్తుండవచ్చు.

మరో వైపు బీజేపీ పవన్ కళ్యాణ్‌ను దక్షిణాది రాష్ట్రాలలో తిప్పి, రాజకీయ ప్రయోజనాల కోసం యత్నిస్తుందా అన్న సందేహం కూడా చాలా మందిలో ఉంది. భవిష్యత్తులో దక్షిణాదిలో బీజేపీ ఎదగడానికి ఇలాంటి సినీ నటులు కొందరిని వాడుకుంటే వాడుకోవచ్చని చెబుతున్నారు. కేరళలో ఇప్పటికే ప్రముఖ నటుడు గోపికి కేంద్ర మంత్రి పదవి ఇచ్చింది. ఏపీలో పవన్ సోదరుడు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి తమవైపు ఉన్నట్లు చూపించే యత్నం చేస్తోంది. ఇవన్నీ కూడా రాజకీయాలలో కీలకమైన అంశాలే అవుతాయి. పవన్ కళ్యాణ్‌కు భక్తి విశ్వాసాల మీద కూడా రకరకాల అభిప్రాయాలు ఉన్నాయి. ఆయన ఒకసారి క్రైస్తవ మతానికి, మరోసారి ముస్లిం మతానికి అనుకూలంగా మాట్లాడడం, తన కుటుంబంలోనే తన పిల్లలే క్రైస్తవం తీసుకోవడం వంటి అంశాలు ఆయనపై విమర్శలకు దారి తీస్తుంటాయి. అధికారం వచ్చాక తిరుమల లడ్డూ ఘటన సమయంలో సనాతని వేషం కట్టారు. ఆ తర్వాత కొన్నాళ్లు మామూలుగానే కనిపించినా, దక్షిణాది తీర్థయాత్రలో మళ్లీ సనాతని వేషంలోకి రావడం అంతా నాటకీయంగా ఉంది.

తన కుమారుడు అఖిరా నందన్‌ను ప్రమోట్ చేయడానికి కూడా ఈ యాత్రను ఆయన వాడుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. రాజకీయంగా అయినా, భక్తిపరంగా అయినా ఆయన చిత్తశుద్ధితో చేస్తే ఎవరూ తప్పుపట్టరు. కానీ ప్రతిదానిని డ్రామా చేస్తూ పబ్బం గడుపుకుంటూ పోతే మాత్రం పవన్ కళ్యాణ్ కే నష్టం జరగవచ్చు.

# అదే... బుద్ధి..!

# ఈ.. టీ పీ ఓ...దేవి మామూలుది కాదు..?

* అవినీతి నిరోధక శాఖక ఒక్కసారి ఇటు దృష్టి సారిస్తే విస్తు పోయే ఆస్తులు బయటపడతాయట..!?

* ఎక్కడ పని చేసిన పలు ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉందీ.. దేవి..!?

* అధికారిణి హోదాలో పక్క ప్లాన్ తోనే బాగానే కాసులు వెనకేసుకుంటుందనే ఆరోపణలు గుప్పు మంటున్నాయి..

* గతంలో ఎల్బీనగర్ లో చేసిన అదే బుద్ధి...! నాగారం, దమ్మాయిగూడ పరిధిలో చేస్తున్నది అదే... బుద్ధి..?











**హైదరాబాద్ ఫిబ్రవరి17,(సిటీ టైమ్స్):** టిపిఓ అధికారినిగా ఈవిడ గారు ఎక్కడ పని చేసినా కచ్చితంగా చేతివాటం చూపించాల్సిందే... చెప్పినట్టు చేస్తే మూడో కంటికి తెలియకుండా అక్రమ నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చేస్తుంది.. ఇదే విషయంపై స్థానిక ప్రజలు ప్రశ్నిస్తే నాకు సంబంధం లేదు అని మాటను దాటవేస్తుంది.. ఈ దేవి. ఇంతకీ దమ్మాయిగూడ, నాగారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిణి గా పనిచేస్తున్న శ్రీదేవి మేడం గారు ఎంత చెప్పినా వినిపించుకునే మనస్తత్వం కాదని తెలిపోతుంది. సదరు మీడియా ప్రతినిధులు మేడం ఇక్కడ అక్రమం జరుగుతుందని చెబితే వెంటనే తన ఖాతాలో వేసుకొని బాగానే కాసులు తెప్పించుకుని మరో కంటికి తెలియకుండా పోతుందట.. ఇదే విషయాన్ని స్థానికులు మీడియా దృష్టికి తీసుకువస్తూ శ్రీదేవి మామూలు దేవి కాదు, బాగా చేతివాటాన్ని చూపిస్తూ కాసులు బాగానే వెనకేసుకుంటుందంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు.. ఇక అసలు వివరాల్లోకెళ్తే మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చీర్యల్ గ్రామ పరిధి ఓ ఓ ఆర్ సమీపంలో సర్వే నెంబర్ 61లో సుమారు ఎకరం భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఫామ్ హౌస్ నిర్మాణం జరుగుతుంది. ఇలా చేయడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి కోట్ల నిధుల గండి పడడం కాయం. ఇంత బహిర్గతంగా నిర్మాణాలు జరుగుతున్నా.. ఈ అధికారులకు ఎందుకు కనిపించడం లేదో అర్థం కావడం లేదు? అలాగే ప్రగతి నగర్ లో అక్రమ షెడ్ నిర్మాణం పట్టించుకోని సదర్ ఈ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీదేవి కనీసం దీనిపై చర్య తీసుకుంటుందన్న నమ్మకం లేదని స్థానికులు గంట పదంగా చెప్తున్నారు... టిపిఓ అధికారిగా పనిచేస్తున్న శ్రీదేవి గతంలో ఎల్బీనగర్ లో చేసిన నిర్వాకం ఇక్కడ కూడ తమ ఇష్టానుసారంగా చేతివాటాన్ని చూపించి బాగానే వెనకేసుకుందని, ఇప్పుడు దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీకి ఒకే ఒక్క అధికారిగా ఉండటం వల్ల ఇక ఇష్టం వచ్చినట్టుగా దండుకుంటుందని స్థానిక ప్రజలు బహిర్గతంగానే దుమ్మెత్తి పోస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక ప్రజలు, ప్రజా సంఘాలు, నాయకులు తదితరులు కోరుచున్నాను. ఈలాంటి అక్రమ షెడ్లు, భవన నిర్మాణాలపై విడతలవారీగా కథనాల రూపంలో వెలుగులోకి రాబోతున్నాయని గమనించగలరు.



## సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

**సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి అభివృద్ధి చేస్తాం**

**ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం**

**- పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**శేరిలింగంపల్లి,సిటీటైమ్స్:** సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. సోమవారం మియాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీల గార్డెన్, జయప్రకాష్ నారాయణ నగర్, టిఎన్ నగర్ కాలనీలలో రూ.5.60 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే వరద నీటి కాలువ, సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం, కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం రూ.5.60కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు, వరద నీటి కాల్వ నిర్మాణము పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని ,సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని , ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని అన్నారు. నాలాల విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నాలల విస్తరణ పనులు సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని, ప్రధాన రహదారుల పై పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

**: జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి**

**ఎవరి పనులు వారు బాధ్యతగా చేయాలి**

**జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 139 ఆర్జీలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 17,(సిటీ టైమ్స్):** గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించరాదని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమీషనర్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... టౌన్ ప్లానింగ్ నకు సంబంధించి అక్రమ నిర్మాణాలపై సర్కిళ్లలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారహితంగా ప్రవర్తించడం సరి కాదని, ఎవరి పనులు వారు బాధ్యత గా చేయాలన్నారు. నిబంధనల మేరకు అధికారులు పనిచేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు.టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులుస్పీకింగ్ ఆర్డర్స్ జారీ అయిన తర్వాత వెంటనే అనుసరించాల్సిన తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. "నిబంధనల మేరకు అక్రమ నిర్మాణాలు తొలగించడంలో వెనకడుగు వేయరాదని ఆయన స్పష్టం చేసారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులకు ఆదేశించారు.జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 57 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 25, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్, ఫైనాన్స్ విభాగాలకు 3 చొప్పున, యు.బి.డి. ల్యాండ్ అక్విజేషన విభాగాలకు 2 చొప్పున, శానిటేషన్, యు.సి.డి, ఎలక్ట్రికల్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 6 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 82 అర్జీలు అందాయని, అందులో కూకట్ పల్లి జోన్ లో 29, ఎల్బీనగర్, సికింద్రాబాద్ జోన్ లలో 19 చొప్పున, శేరిలింగంపల్లి జోన్ లో 10, చార్మినార్ జోన్ లో 4, ఖైరతాబాద్ జోన్ లో ఒక్క ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు,సీపీ పి శ్రీనివాస్ గీతా రాధిక, పంకజ, సుభద్ర దేవి, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు సి ఏం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ , యు.బి.డి డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, అడిషనల్ సి.సి.పి గంగాధర్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, డిప్యూటీ సీఈ పనసారెడ్డి,హౌసింగ్ ఈ ఈ లు పీవీ రమణ, రాజేశ్వర్ రావు.వాటర్ వర్క్స సాయి రమణ తదితరులు పాల్గొన్నారు.



## అందువల్లే సీఎం ప్రకటన జాప్యం.. భాజపాపై ఆతిశీ విమర్శలు

**దిల్లీ:** దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి దాదాపు వారం రోజులవుతున్నా.. దిల్లీ ముఖ్యమంత్రి ఎవరనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. దిల్లీ నూతన సీఎం, మంత్రివర్గాన్ని ప్రకటించే విషయంలో జాప్యంపై దిల్లీ ఆపద్ధర్మ సీఎం ఆతిశీ భాజపాను ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టి..ప్రభుత్వాన్ని నడిపే సామర్థ్యంగల నేతలు ఎవరూ లేనందున భాజపా ఇంకా అభ్యర్థిని ప్రకటించట్లేదని దుయ్యబట్టారు. ఎన్నికల్లో గెలుపొందిన 48 మంది భాజపా ఎమ్మెల్యేల్లో ఒకరిపైన కూడా ప్రధాని మోదీకి నమ్మకం లేదని.. అందుకే నూతన సీఎంను ప్రకటించడానికి వెనుకడుగు వేస్తున్నారని అన్నారు. దేశ రాజధానిలో ప్రభుత్వాన్ని నడిపే సత్తా లేనివారు ప్రజల అభివృద్ధికి ఎలా పని చేస్తారని ప్రశ్నించారు.

**20న దిల్లీ నూతన సీఎం ప్రమాణస్వీకారం..**

దిల్లీ ముఖ్యమంత్రి ఎవరనే విషయంపై భాజపా ఇంకా స్పష్టత ఇవ్వనప్పటికీ..ఫిబ్రవరి 20న కొత్త ప్రభుత్వం కొలువు తీరుతుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కార్యక్రమానికి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదిక కానున్నట్లు సమాచారం. గురువారం సాయంత్రం 4.30 గంటలకు నూతన సీఎం, మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల్లో గెలుపొందిన 48 మంది ఎమ్మెల్యేలలో 15మంది పేర్లతో ఇప్పటికే భాజపా ఒక జాబితా రూపొందించిందని..దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దిల్లీ భాజపా నేతలతో చర్చించి..త్వరలో కొత్త సీఎంను ప్రకటిస్తారని పార్టీ జాతీయ కార్యదర్శి మన్‌జిందర్ సింగ్ సిర్సా తెలిపారు. ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. 8వ తేదీన ఫలితాలు వెల్లడయ్యాయి. ఇందులో ఘన విజయం సాధించిన భాజపా.. 70 స్థానాలకు 48 చోట్ల గెలుపొంది 27 ఏళ్ల తర్వాత అధికారం చేపట్టేందుకు సిద్ధమైంది. అయితే, ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనే విషయంపై ఎటువంటి ప్రకటన వెలువర్చలేదు. ముఖ్యమంత్రి అభ్యర్థి రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నా.. మాజీ సీఎం కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. అశీశ్ సూద్, రేఖా గుప్తాల పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ఉండనున్నట్లు సమాచారం.



## భారత్‌కు ఖతర్ ఎమిర్.. ఎయిర్‌పోర్టులో స్వయంగా స్వాగతం పలికిన మోదీ

ఖతర్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హామద్ అల్ థానీ రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం భారత్‌కు విచ్చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా దిల్లీ విమానాశ్రయానికి వెళ్లి ఆయనకు సాదర స్వాగతం పలకడం విశేషం. "నా సోదరుడికి స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్ట్ వెళ్లాను. భారత్‌లో ఆయన పర్యటన ఫలవంతం అవుతుందని ఆశిస్తున్నా" అని సంబంధిత ఫొటోలు పోస్ట్ చేస్తూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. అనంతరం విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌తో తమీమ్ బిన్ హామద్ భేటీ అయ్యారు. తన పర్యటనలో భాగంగా మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ఖతర్ ఎమిర్ సమావేశం కానున్నారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. ద్వైపాక్షిక సంబంధాలపై ఇరునేతలు చర్చలు జరుపుతారని విదేశాంగశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు విచ్చేసిన తమీమ్ బిన్ హామద్.. భారత్‌లో పర్యటించడం ఇది రెండోసారి. 2015లో ఓసారి సందర్శించారు. ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగశాఖ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపింది.

## స్నేహా చికెన్ అక్రమాలపై ఢిల్లీలో ఫిర్యాదు చేసిన రాచాల...

**కంపెనీ కార్యకలాపాలపై తక్షణ పర్యావరణ ఆడిట్ నిర్వహించండి...**

**కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి రాచాల విజ్ఞప్తి...**



**వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ ఫిబ్రవరి 17:** అనధికార నీటి వెలికితీత, ప్రభుత్వ భూమి ఆక్రమణ, మరియు పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడుతున్న స్నేహ చికెన్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిని కలిసి కంపెనీ చేస్తున్న అక్రమాలను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్నేహ చికెన్ పరిశ్రమ యొక్క తనిఖీ చేయని కార్యకలాపాలు పర్యావరణ క్షీణతకు, సహజ వనరుల క్షీణతకు మరియు స్థానిక సమాజానికి తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలకు కారణమవుతున్నాయని,ఈ ఉల్లంఘనలపై బాధిత రైతులు, నిర్వాసితులు ఆందోళనలు చేసినప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదు కాబట్టి, స్నేహ చికెన్ పరిశ్రమకు వ్యతిరేకంగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జోక్యం చేసుకుని తక్షణ పరిష్కార చర్యలను ప్రారంభించాలని కోరారు.తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో గల శంకర సముద్రం రిజర్వాయర్ నుంచి స్నేహ చికెన్ ఇండస్ట్రీస్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నీటిని తీసుకెళ్తుందని, దీనివల్ల సాగునీరు, తాగునీరు కోసం రిజర్వాయర్‌పై ఆధారపడిన స్థానిక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ నీరు, భూమి మరియు చెట్ల చట్టం (వాల్టా), 2002 రిజర్వాయర్ నీటి పారిశ్రామిక వినియోగం వ్యవసాయ మరియు తాగునీటి అవసరాలకు రాజీ పడకూడదని ఆదేశించిందని, అయినప్పటికీ కంపెనీ ప్రతిరోజూ లక్షల లీటర్లను దౌర్జన్యంగా తీసుకెళ్తుందన్నారు. స్నేహ చికెన్ ఇండస్ట్రీస్ మరియు దాని కార్యకలాపాలపై తక్షణ పర్యావరణ ఆడిట్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. శంకర సముద్రం రిజర్వాయర్ కోసం నీటి వెలికితీత అనుమతులను తనిఖీ చేసి, పర్యవరణ ఉల్లంఘనలపై దర్యాప్తు చేసి పరిశ్రమకు అవసరమైన షోకాజ్ నోటీసులు జారీ చేయమని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిని ఆదేశించాలని కోరారు. పర్యావరణానికి మరింత నష్టం జరగకుండా నిరోధించడానికి అవసరమైన కాలుష్య నియంత్రణ మరియు వ్యర్థాల నిర్మూలన చర్యలు అమలులో ఉన్నాయో లేదో నిర్ధారించుకొని, వెల్టూరు గ్రామంలో అక్రమంగా ఆక్రమించబడిన ప్రభుత్వ భూమిని పునరుద్ధరించడానికి మరియు భూమి ఆక్రమణపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకెళ్లాలన్నారు.పర్యావరణ పరిరక్షణ మరియు నియంత్రణ అమలులో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి యొక్క నిబద్ధతను నేను విశ్వసిస్తున్నానని, మరియు ప్రభావిత ప్రాంతంలోని సహజ వనరులు, ప్రజారోగ్యం మరియు వ్యవసాయ జీవనోపాధిని కాపాడేందుకు తక్షణ చర్యకు తీసుకోవాలని కోరినట్లు రాచాల తెలిపారు.

## నిన్నటి హత్య మరువక ముందే మేడ్చల్ లో మరో హత్య



**సిటీ టైమ్స్ మేడ్చల్:-** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మరో హత్య కలకలం రేపింది. మేడ్చల్ పట్టణంలో కిష్టాపూర్ వెళ్లే రోడ్డుపక్కన ఇంట్లో వెంకట రమణ (32) అనే వ్యక్తిని మేడపై దారుణంగా కోసి చంపిన గుర్తు తెలియని వ్యక్తులు చేశారు. స్థానికుల సమాచారం మేరకు మేడ్చల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్న ఏసీపీ మృత దేహాన్ని పరిశీలించి క్లూస్ టైమ్ ఆధారాలు స్వీకరిస్తున్నారు.




## ఘనంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

**కొత్తకోట చౌరస్తాలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బి ఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు పార్టీ కార్యాకర్తలు**

**కొత్తకోట సిటీ టైమ్స్ ఫిబ్రవరి 17:** వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో గౌరవ మాజీ ఎమ్మెల్యే శ్రీ ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు.. నేడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ అభివృద్ధి ప్రదాత, తెలంగాణ ఉద్యమకారుడు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదినాన్ని పురస్కరించుకొని కొత్తకోట మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద మొత్తంలో విచ్చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. చంద్రశేఖర రావు జన్మదిన పురస్కరించుకొని కేక్ కట్ చేసి అనంతరం కొత్తకోట మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ మౌనిక, మాజీ సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి,మాజీ జెడ్పిటిసి విశ్వేశ్వర, బి ఆర్ ఎస్ పార్టీ దేవరకద్ర నియోజకవర్గ అధ్యక్షురాలు జయంతి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆకుల శీను, మూలమల్ల యుగేందర్ రెడ్డి,జగదీష్, కొత్తకోట మండలానికి చెందిన బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు, గ్రామ బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్లు,మాజీ ప్రజా ప్రతినిధులు, కెసిఆర్ సార్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అమెరికాతో ఉద్రిక్తతలకు తెర పడనుందా..? రష్యా ఏమన్నదంటే!



అమెరికారష్యా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు ముగింపు పలకాలని వ్లాదిమిర్ పుతిన్, డొనాల్డ్ ట్రంప్‌లు కోరుకుంటున్నారని రష్యా వెల్లడించింది. ఈ విషయాన్ని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడించారు. అమెరికా రష్యాల మధ్య సంబంధాల పునరుద్ధరణ, ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం తదితర అంశాలపై సౌదీ అరేబియా వేదికగా ఇరు దేశాల నేతలు భేటీ కానున్న నేపథ్యంలో లావ్రోవ్ ఈ విధంగా స్పందించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఫోన్‌లో మాట్లాడిన విషయాన్ని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ గుర్తు చేశారు. ఇరు దేశాల మధ్య క్షీణించిన సంబంధాలపై వారు మాట్లాడారని, వాటి పునరుద్ధరణ కోసం ఇరు దేశాధ్యక్షులు చర్చలు జరిపేందుకు అంగీకరించారని చెప్పారు.




# రిలయన్స్ మరో ఘనత.. యాపిల్‌ను వెనక్కి నెట్టి టాప్ 2లోకి..

**దిల్లీ:** భారత అతిపెద్ద, అత్యంత విలువైన కంపెనీగా పేరొందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా మరో ఘనత సాధించింది. 2024 ఏడాదికి గానూ ఫ్యూచర్‌బ్రాండ్ విడుదల చేసిన అంతర్జాతీయ అత్యుత్తమ బ్రాండ్‌ల జాబితాలో ఏకంగా రెండో స్థానంలో నిలిచింది. యాపిల్, నైక్ వంటి దిగ్గజ సంస్థలను వెనక్కి నెట్టి రిలయన్స్ టాప్ 2 బ్రాండ్‌గా అవతరించింది. మార్కెట్ మార్పులను ముందే ఊహించి వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం, బ్రాండ్ ప్రయోజనాలను ఉత్తమంగా నెరవేర్చడం, కంపెనీ అనుభవాలు తదితర అంశాల ఆధారంగా ఫ్యూచర్‌బ్రాండ్ ఈ జాబితాను రూపొందించింది. ఇందులో దక్షిణ కొరియా దిగ్గజం శాంసంగ్ అగ్ర స్థానంలో నిలవగా.. రిలయన్స్ రెండో స్థానం దక్కించుకుంది. గత జాబితాలో ఐదో స్థానంలో ఉన్న శాంసంగ్.. ఈ సారి టాప్ 1లో నిలిచింది. 2023లో విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో 13వ స్థానంలో ఉన్న రిలయన్స్.. ఈసారి ఏకంగా 11 స్థానాలు ఎగబాకి టాప్ 2కు చేరుకోవడం విశేషం. యాపిల్, నైక్, వాల్ట్ డిస్నీ, నెట్‌ఫ్లిక్స్, మైక్రోసాఫ్ట్, టొయోటా లాంటి ప్రముఖ బ్రాండ్లను దాటుకుని ఈ ఘనత సాధించింది. అంతేగాక.. ఈ అత్యుత్తమ బ్రాండ్ల జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ బ్రాండ్ ఇదే కావడం మరో ప్రత్యేకం. కాగా.. 2023లో అగ్ర స్థానంలో నిలిచిన యాపిల్.. ఈ సారి మూడో ర్యాంక్‌కు పడిపోవడం గమనార్హం.

**అంతర్జాతీయంగా టాప్ 10 బ్రాండ్‌లు ఇవే..**

శాంసంగ్ (దక్షిణ కొరియా)
రిలయన్స్ (భారత్)
యాపిల్ (అమెరికా)
నైక్ (అమెరికా)
ఏఎస్ఎంఎల్ సెమీ కండక్టర్స్ (నెదర్లాండ్స్)
డెనహర్ కార్పొరేషన్ (అమెరికా)
ది వాల్ట్ డిస్నీ (అమెరికా)
మౌటాయ్ (చైనా)
టీఎస్ఎంసీ సెమీ కండక్టర్స్ (తైవాన్)
ఐహెచ్‌సీ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)

# 50mp సెల్ఫీ కెమెరా, ఏఐ ఫీచర్లతో వివో వీ50.. ధర, ఇతర వివరాలు ఇవే!

చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వివో.. మిడ్‌రేంజ్ సెగ్మెంట్‌లో వీ50 పేరిట కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. ముఖ్యంగా కెమెరా ప్రియులను టార్గెట్ చేస్తూ ఈ ఫోన్ తీసుకొచ్చింది. వెనకవైపు 50 ఎంపీ డ్యూయల్ కెమెరాతో పాటు సెల్ఫీల కోసం ముందు వైపు కూడా 50 ఎంపీ కెమెరా ఇవ్వడం విశేషం. సర్కిల్ టు సెర్చ్, ట్రాన్స్‌స్క్రిప్ట్ అసిస్ట్, లైవ్ కాల్ ట్రాన్సలేషన్ వంటి ఏఐ ఫీచర్లు ఉన్నాయి.

**వివో వీ50 ఫీచర్లు..**

వివో వీ50 6.77 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ క్వాడ్ కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే అమర్చారు. ఇది 120Hz రిఫ్రెష్ రేటు, 4500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఇందులో స్నాప్‌డ్రాగన్ 7 జనరేషన్ 3 ప్రాసెసర్‌ను అమర్చారు. ఔటాఫ్‌ది బాక్స్ ఆండ్రాయిడ్ 15తో కూడిన ఫన్‌టచ్ ఓఎస్ 15తో వస్తోంది. కెమెరా విషయానికొస్తే.. వెనకవైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా ఉంది. ఇది ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. 50 ఎంపీ అల్ట్రావైడ్ షూటర్ ఉంది. ముందు వైపు కూడా 50 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఆరా లైట్, ఏఐతో పనిచేస్తే ఫొటో ఎడిటింగ్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి. 6000 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. 90W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ అమర్చారు. ఐపీ 68, ఐపీ 69 రేటింగ్‌తో వస్తోంది.

**ధర, విక్రయాలు**

వివో వీ50 మూడు రకాల ర్యామ్, స్టోరేజీ వేరియంట్లతో వస్తోంది. 8జీబీ + 128జీబీ వేరియంట్ ధరను రూ.34,999గా కంపెనీ నిర్ణయించింది. 8జీబీ+ 256జీబీ వేరియంట్ ధర రూ.36,999గా పేర్కొంది. టాప్ వేరియంట్ 12జీబీ+512జీబీ స్టోరేజీతో వస్తోంది. దీని ధరను రూ.40,999గా పేర్కొంది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, వివో ఇండియా ఇస్టోర్‌లో ఫిబ్రవరి 25 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ప్రీ బుకింగ్స్ మొదలయ్యాయి.





# రూ.5 లక్షలకు మించినా డిపాజిట్ బీమా!

**పెంపు ప్రతిపాదనల్లో ప్రభుత్వం**

**ముంబయి:** బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు వర్తించే బీమా గరిష్ఠ పరిమితిని రూ.5 లక్షల నుంచి పెంచాలనే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు సోమవారం వెల్లడించారు. ముంబయికి చెందిన న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ మోసం బహిర్గతం అయిన కొద్ది రోజులకే, ఈ ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నట్లు ఆయన వివరించడం గమనార్హం. 'డిపాజిట్ బీమా పరిమితిని పెంచాలనే అంశం పరిశీలనలో ఉంది. ప్రభుత్వం ఆమోదించాక దాన్ని అమలు చేస్తాం' అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. ఏదైనా బ్యాంక్, తన ఖాతాదార్లకు డిపాజిట్ మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) ఆ మొత్తాన్ని చెల్లిస్తుంది. ఈ మొత్తం రూ.5 లక్షలకు పరిమితం. (2020 వరకు ఇది రూ.లక్షగా ఉండేది) ఇందుకుగాను ఈ సంస్థ బ్యాంకుల నుంచి ప్రీమియాన్ని వసూలు చేస్తుంది. న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్‌లో ఉన్న 1.3 లక్షల డిపాజిటర్లలో 90 శాతం మందికి డీఐసీజీసీ కింద పూర్తి మొత్తం లభిస్తుంది. బ్యాంక్ పుస్తకాల్లో చూపించిన రూ.122 కోట్ల నగదు వాస్తవంగా లేదనే నిజం తనిఖీలో బయటపడింది. బ్యాంక్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ హితేశ్ మెహతా ఒక స్థానిక బిల్డరుకు ఈ మొత్తాన్ని అక్రమంగా అందించినట్లు తేలింది.



# లాభాల స్వీకరణ కోసమే ఎఫ్ఐఐ అమ్మకాలు

**ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**

**ముంబయి:** మన స్టాక్‌మార్కెట్లలో లాభాల స్వీకరణ కోసమే విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) అమ్మకాలకు దిగుతున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ మదుపర్లకు అత్యుత్తమ ప్రతిఫలాలు అందిస్తోందని, తమ పెట్టుబడులపై లాభాలు స్వీకరించే ధోరణిలో విదేశీ మదుపర్లు ప్రస్తుతం ఉన్నారని మంత్రి చెప్పారు. 'ప్రస్తుతం భారత మార్కెట్, భారత ఆర్థిక వ్యవస్థ పెట్టుబడులపై ఆకర్షణీయ ప్రతిఫలాలు అందిస్తోంది. అందుకే లాభాల స్వీకరణ చోటుచేసుకుంటోంద'ని మంత్రి వివరించారు. గత అక్టోబరు నుంచి దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు రూ.1.56 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. 2025 ప్రారంభం నుంచే ఇప్పటిరవకు దాదాపు రూ.1 లక్ష కోట్లను ఉపసంహరించుకున్నారు. ఈ కారణంతో మార్కెట్ గణనీయ స్థాయిలో దిద్దుబాటు అయ్యింది. ఎఫ్ఐఐలు ఒక వర్ధమాన విపణి నుంచి మరోక వర్ధమాన విపణికి వెళ్లడం లేదు. అంతర్జాతీయ అనిశ్చితుల సమయంలో, తమ సొంత దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతుంటారు. అందువల్ల అమెరికాకు ఇవి ఎక్కువగా వెళ్తుంటాయ'ని ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్ కాంత పాండే తెలిపారు. పెట్టుబడుల ఉపసంహరణ తాత్కాలికంగానే ఉండొచ్చని.. భారత మార్కెట్లు తిరిగి పుంజుకుంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# నిత్యావసరాలు చిన్న ప్యాక్‌ల్లో.. ప్రీమియం ఉత్పత్తులు ఈఎంఐల్లో

**మధ్య తరగతి ప్రజల కొనుగోలు ధోరణి ఇదీ పసిడి పొదుపు పథకాలపైనా ఆసక్తి**

దేశంలో మధ్య తరగతి ప్రజల వ్యయాల ధోరణి సంక్లిష్టంగా మారుతోంది. ధరలు అధికంగా ఉన్నందున, రోజువారీ వాడుకునే బిస్కెట్లు, స్నాక్స్, సబ్బుల వంటి ఉత్పత్తులను చిన్న ప్యాక్‌లలో కొనుగోలు చేస్తున్నారు. టీవీలు, రిఫ్రిజరేటర్లు, వాషింగ్‌మెషీన్లు, స్మార్ట్‌ఫోన్లకు వస్తే నాణ్యమైనవి అధిక సామర్థ్యంతో ఉన్న ప్రీమియం ఉత్పత్తులనే కొనేందుకు ఇష్టపడుతున్నారు. ఇందుకోసం నెలవారీ వాయిదా పద్ధతి (ఈఎంఐ)ని ఎంచుకుంటున్నారు. పొదుపుమదుపు కోసం బ్యాంక్ డిపాజిట్లు, షేర్లతో పాటు బంగారం నెలవారీ పెట్టుబడి పథకాలను ఆశ్రయిస్తున్నారు.

**రుణ సదుపాయం సులభమైనందునే**

ఖరీదైన గృహోపకరణాలను రుణంపై కొనడం గతం నుంచీ ఉన్నా, ఇప్పుడు మరింత పెరిగింది. గతంలో తమ తాహతకు తగ్గట్లు అందుబాటు ధరలో ఉన్న వాటితో మధ్యతరగతి వర్గీయులు సంతృప్తి పడేవారు. ఇప్పుడు మాత్రం ఖరీదు ఎక్కువైనా, విక్రయానంతర సేవలు బాగుండే బ్రాండెడ్ ఉత్పత్తులవైపు మొగ్గుచూపుతున్నారని విజయ్ సేల్స్ డైరెక్టర్ నీలేశ్ గుప్తా వెల్లడించారు. ఈఎంఐలపై కొనుగోళ్లు అయిదేళ్ల క్రితం ఇవి 5560 శాతంగా ఉంటే, ప్రస్తుతం 75 శాతానికి పైగా పెరిగాయని వివరించారు. రుణ మంజూరు ప్రక్రియ సులభం కావడం, వస్తువుల వినియోగ ధోరణి మారడం ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు.

**రుణ రేట్ల కోత కలిసొస్తుంది**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో, ఎస్‌బీఐ సహా బ్యాంకులు రుణ రేట్లలో 0.25% కోత విధించాయి. ఇందువల్ల కొత్త రుణాలకు ఈఎంఐ, ప్రస్తుతం కంటే తగ్గుతుంది. ప్రీమియం ఉత్పత్తులకు మరింత గిరాకీ పెరిగేందుకు ఇది కారణమవుతుంది. ఉద్యోగాలు చేస్తున్న యువత అభిరుచి కారణంగా ప్రీమియం ఉపకరణాలకు గిరాకీ అధికమవుతోందని పానసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా ఎండీ ఫుమియాసు ఫుజిమోరీ వెల్లడించారు.

**పొదుపు చేస్తూ పసిడి ఆభరణాలు**

పసిడి ఆభరణాల కొనుగోళ్లకు కూడా ఫ్లెక్సిబుల్ చెల్లింపుల పథకాలను కొన్ని సంస్థలు అందిస్తున్నాయి. నెలవారీగా డబ్బులు కడితే, 12 నెలల తరవాత పోగైన మొత్తంతో బంగారు ఆభరణాన్ని తరుగు, మజూరు ఛార్జీలు లేకుండా కొనుగోలు చేసుకోవచ్చని కొన్ని సంస్థలు, 11 నెలలు కొనుగోలుదార్లు డబ్బులు కడితే, 12వ నెల వాయిదా తామే కడతామని మరి కొన్ని ఆభరణాల సంస్థలు ప్రకటిస్తున్నాయి. మధ్య తరగతి కొనుగోలుదార్లు ఈ పథకాలను ఎంచుకుంటున్నారని మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపీ అహమ్మద్ వెల్లడించారు.

**మధ్య తరగతి చేతుల్లోకి మరింత నగదు**

ఇటీవలి బడ్జెట్‌లో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచారు. ఈ అనూహ్య నిర్ణయంతో దేశంలో కోటి మంది ప్రజలకు రూ.80,000 వరకు పన్ను ఆదా అవుతుందని చెబుతున్నారు. దీంతో ప్రయాణాలు, ఫ్యాషన్ ఉత్పత్తుల కొనుగోళ్లు, ఫాస్ట్ ఫుడ్ వినియోగం పెరిగే అవకాశం ఉందని మారికో ఎండీ సౌగటా గుప్తా వెల్లడించారు. ఈ అదనపు ఆదాయం అన్ని రంగాల్లోకి సమానంగా వెళ్లకపోవచ్చని, కాకపోతే మన్నికైన వినిమయ వస్తువులపై అధికంగా వెచ్చిస్తారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.





# జనవరిలో పెరిగిన వాణిజ్య లోటు

**2.38% తగ్గిన ఎగుమతులు**

**దిల్లీ:** ఈ ఏడాది జనవరిలో దేశీయ ఎగుమతులు 36.43 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.16 లక్షల కోట్లు)కు పరిమితమయ్యాయి. 2024 జనవరి ఎగుమతులతో పోలిస్తే ఇవి 2.38% తక్కువ. ఎగుమతులు తగ్గడం వరుసగా ఇది మూడో నెల. ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, బియ్యం, రత్నాభరణాల రంగాల ఎగుమతులు రాణించాయి. పెట్రోలియం ధరల్లో హెచ్చుతగ్గులు, అంతర్జాతీయ అనిశ్చితులు మొత్తంమీద ఎగుమతులు తగ్గేందుకు కారణమయ్యాయి. గత నెలలో దిగుమతులు 10.28% పెరిగి 59.42 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఫలితంగా వాణిజ్య లోటు 22.99 బిలియన్ డాలర్లకు పెరిగింది. ముడిచమురు దిగుమతులు ఏడాది క్రితం నాటి 16.56 బి.డాలర్ల నుంచి గత నెలలో 13.43 బి.డాలర్లకు తగ్గాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌జనవరిలో ఎగుమతులు 202324 ఇదే సమయం కంటే 1.39% పెరిగి 358.91 బి.డాలర్లకు; దిగుమతులు 7.43% అధికమై 601.9 బి.డాలర్లకు చేరాయి. ఫలితంగా వాణిజ్య లోటు 242.99 బి.డాలర్లకు పెరిగింది. గతేడాది డిసెంబరులో వాణిజ్య లోటు 21.94 బి.డాలర్లుగా, జనవరిలో 16.55 బి.డాలర్లుగా ఉంది. సిడి దిగుమతులు 40% పెరిగాయ్: జనవరిలో పసిడి దిగుమతులు 40.79% పెరిగి 2.68 బి.డాలర్లకు చేరాయి. 2024 జనవరిలో ఇవి 1.9 బి.డాలర్లుగా, డిసెంబరులో 15.27 బి.డాలర్లుగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌జనవరి మధ్య పసిడి దిగుమతులు ఏడాది క్రితం ఇదే సమయం నాటి 37.85 బి.డాలర్ల నుంచి 32% వృద్ధితో 50 బి.డాలర్లుగా నమోదయ్యాయి. 202425లో వస్తువులు, సేవల ఎగుమతుల విలువ 800 బి.డాలర్లను అధిగమించొచ్చు. 202324లో ఇవి 778 బి.డాలర్లుగా ఉన్నాయని వాణిజ్య కార్యదర్శి సునీల్ భర్త్‌వాల్ తెలిపారు.

# టారిఫ్‌ల కోత దిశగా భారత్, అమెరికా

**ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై త్వరలో భారత్, అమెరికా చర్చలు**

**దిల్లీ:** ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై భారత్‌అమెరికాలు కొద్ది వారాల్లో చర్చలు ప్రారంభించనున్నాయి. ఒప్పంద స్థూల అంశాలు ఈ చర్చల్లో నిర్ణయమవుతాయని వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి రాజేష్ అగర్వాల్ సోమవారం తెలిపారు. 2030 కల్లా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యాన్ని ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరు దేశాలూ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇరు దేశాలకూ ప్రయోజనం కలిగేలా, బహుళ రంగ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)పై తొలి దశ చర్చలు 89 నెలల్లో పూర్తి అవుతాయని అగర్వాల్ పేర్కొన్నారు. భారత్‌కు అమెరికా పారిశ్రామిక వస్తువుల ఎగుమతులు; అమెరికాకు భారత తయారీ ఉత్పత్తుల ఎగుమతులను విస్తృతం చేసుకోవడానికి ఇరు దేశాలూ అంగీకరించాయి. వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యాన్ని పెంచడానికీ ఇరు పక్షాలు కలిసి పనిచేస్తాయి. 4 బిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయ వస్తువులను అమెరికాకు భారత్ ఎగుమతి చేసింది. వీటికి మరింత ఊతం లభించనుందని అగర్వాల్ తెలిపారు. టారిఫ్‌లు తగ్గుతాయా?: ప్రస్తుతం ఇరుదేశాల మధ్య 200 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని 2030 కల్లా 500 బి.డాలర్లకు పెంచాలంటే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) వంటి ఒప్పందం అవసరమని వాణిజ్య కార్యదర్శి సునీల్ భర్త్‌వాల్ పేర్కొన్నారు. సాధారణంగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కింద, ఇరు దేశాలు ఎక్కువ వస్తువులపై తక్కువ కస్టమ్స్ సుంకం లేదా మినహాయింపు కల్పిస్తాయి. సేవల వాణిజ్యానికి నిబంధనలను సరళీకరిస్తాయి. అమెరికా ఇటీవల ప్రకటించిన ప్రతీకార టారిఫ్‌ల వల్ల ప్రధాన ఆర్థిక వ్యవస్థలపై అధిక ప్రభావం పడినా, మనదేశంపై పరిమిత ప్రభావమే ఉండొచ్చు. ఇందుకు కారణం వాణిజ్య లోటును పూడ్చే దిశగా అమెరికా ప్రయత్నిస్తుండడమే. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) ప్రకారం.. భారత్‌కు అమెరికా చేస్తున్న ఎగుమతుల విలువలో 75% వరకు సగటు టారిఫ్ 5 శాతంగానే ఉంది. భారత్ ఎగుమతి చేస్తున్న పలు ఉత్పత్తులపై 1535% మేర టారిఫ్‌లు అమెరికాలో పడుతున్నాయి. జనవరిలో అమెరికాకు పెరిగిన ఎగుమతులు: ఈ ఏడాది జనవరిలో అమెరికాకు భారత్ 8.44 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు చేసింది. 2024 జనవరితో పోలిస్తే ఇవి 39% అధికం. జనవరిలో దిగుమతులు 33.46% పెరిగి 3.57 బి.డాలర్లుగా నిలిచాయి. 202324 ఏప్రిల్‌జనవరిలో అమెరికాకు మన ఎగుమతులు 62.84 బి. డాలర్లు కాగా, 202425 ఇదే కాలంలో 8.95% వృద్ధితో 68.46 బి.డాలర్లకు చేరాయి.

**ప్రతీకార టారిఫ్‌లు అమల్లోకి వచ్చాకే**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార టారిఫ్‌లను అమెరికా చట్ట రూపంలోకి తీసుకువచ్చిన తర్వాతే, భారత్ వాటిని పరిశీలిస్తుందని వాణిజ్య శాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. టారిఫ్‌ల విధింపు జరిగాక.. విశ్లేషణ జరుగుతుందని తెలిపారు.



# ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ Aలో భారత్..

ఏడాది వ్యవధిలో భారత్ మూడో ఐసీసీ ట్రోఫీ బరిలోకి దిగుతోంది. గత రెండింట్లో ఒకదానిని కైవసం చేసుకోగా.. మరొక ఫైనల్‌లో ఓడి రన్నరప్‌గా నిలిచింది. ఇక ఫిబ్రవరి 19 నుంచి టాప్ 8 జట్లు తలపడే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం సిద్ధమైంది. మరి విజేతగా నిలవాలంటే తొలుత గ్రూప్ స్టేజ్‌ను అధిగమించాలి. మరి మన గ్రూప్‌లో ఏ జట్లు ఉన్నాయి? ఏ జట్టు ప్రమాదకరం? అనే విషయాలపై ఓ లుక్కేద్దాం.. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఎడిషన్‌లో భారత్ గ్రూప్ Aలో తలపడనుంది. ఇందులో టీమ్‌ఇండియా కాకుండా.. పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ ఉన్నాయి. ఈసారి వన్డే ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే, ఒక్క మ్యాచ్ ఓడినా.. సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారిపోతాయి. ఏమాత్రం భారీ ఓటమి ఎదురైనా సరే ఇంటిముఖం పట్టాల్సిందే. గ్రూప్‌లోని ప్రతి జట్టూ ప్రమాదకరమే. టీమ్‌ఇండియా మ్యాచులన్నీ దుబాయ్‌లోనే జరుగుతాయి. అక్కడి పరిస్థితులు కాస్త అటు ఇటుగా భారత్‌ను పోలి ఉంటాయనే ఉద్దేశంతో ఐదుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. ఆతిథ్యం ఇస్తోన్న పాక్, తాజాగా ముక్కోణపు సిరీస్‌ను సొంతం చేసుకున్న న్యూజిలాండ్, సంచలనాలు సృష్టించడంలో ముందుండే బంగ్లాదేశ్‌తో ప్రమాదం పొంచి ఉందనేది క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం.

**సంచలనాల బంగ్లా**

గ్రూప్ Aలో భారత్ ఆడబోయే తొలి మ్యాచ్ బంగ్లాదేశ్‌తోనే . ఫిబ్రవరి 20న ఈ మ్యాచ్ జరగనుంది. ఈ గ్రూప్‌లో కాస్త బలహీనమైన జట్టు బంగ్లానే. అలాగని ఏమాత్రం అజాగ్రత్త వహించినా పెను ప్రమాదం తప్పదు. 2007వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియాకు బంగ్లా షాక్ ఇచ్చిన సంగతి గుర్తుందిగా.. భారత్‌తో మ్యాచ్ అంటే బంగ్లాదేశ్ ప్లేయర్లు ఇంకాస్త మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తారు. కానీ, ఇప్పుడున్న ఆ జట్టు పరిస్థితిని బట్టి మ్యాచ్‌లో గెలవడం భారత్‌కు కాస్త సులువే. గత ఆరు వన్డేల్లో ఐదింట్లో బంగ్లాదేశ్ ఓడిపోయింది. ఆ జట్టు ప్లేయర్లకు ఇప్పుడు 50 ఓవర్ల క్రికెట్ ప్రాక్టీస్ కూడా లేదు. వీరంతా నేరుగా బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ నుంచి వచ్చారు. కెప్టెన్ షాంటోతోపాటు మహ్మదుల్లా, ముష్ఫికర్ రహీం, ముస్తాఫిజుర్‌పైనే బంగ్లా ఎక్కువగా ఆధారపడి ఉంది. దుబాయ్‌లో స్పిన్ హవా నేపథ్యంలో.. స్పిన్నర్ రిషద్ ప్రభావం చూపిస్తాడని బంగ్లా ఆశాభావంతో ఉంది. అయితే, బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో భారత్ భారీ విజయం సాధిస్తే మాత్రం సెమీస్ అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఇతర జట్లూ ఇదే లక్ష్యంతో ఆడతాయనడంలో సందేహం లేదు.

**అంచనాలకు అందని పాక్**

ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసే మ్యాచుల్లో దాయాదుల పోరు ఒకటి. ఫిబ్రవరి 23న భారత్ పాకిస్థాన్ జట్ల మధ్య దుబాయ్ వేదికగా మ్యాచ్ జరగనుంది. ఆతిథ్య హోదాలో బరిలోకి దిగుతున్న పాక్‌కు ఈ టోర్నీ అత్యంత కీలకం. కేవలం భారత్‌తో జరగబోయే మ్యాచ్ మాత్రమే దుబాయ్‌లో ఆడే పాక్.. తన మిగతా మ్యాచుల్లో సొంత మైదానాల్లోనే తలపడనుంది. తాజాగా ముక్కోణపు సిరీస్ ఫైనల్‌లో ఓటమి చవిచూసిన పాక్.. గత మ్యాచుల్లో మాత్రం అద్భుతమైన క్రికెట్ ఆడింది. ఇదే సిరీస్‌లో అత్యధిక టార్గెట్‌ను ఛేదించి పాక్ ఘన విజయం సాధించింది. అంతేకాకుండా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత్‌పైనే పాక్ విజయం సాధించి టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. ఆ మ్యాచ్ ఓటమికి ఇప్పుడు టీమ్‌ఇండియా ప్రతీకారం తీర్చుకోవాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్, సల్మాన్ అఘా మంచి ఫామ్‌లో ఉండటం వారికి కలిసొచ్చే అంశం. స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ పరుగులు చేయడంలో ఇబ్బంది పడుతున్నాడు. అలాగే, యువ సంచలనం సయీమ్ అయూబ్ గాయం కారణంగా వైదొలగడం పాక్‌కు నష్టమే. అదే సమయంలో బుమ్రా లేకుండానే టీమ్‌ఇండియా ఆడనుంది. ఇక పాక్ పేస్ త్రయం షహీన్, రవూఫ్, నసీమ్ భారత్‌పై అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తారు. టీమ్‌ఇండియాకు స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ నుంచి ప్రమాదం తప్పదని విశ్లేషకుల అంచనా.



**డేంజరస్ కివీస్**

ఐసీసీ టోర్నీల్లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చే జట్లలో న్యూజిలాండ్ ఒకటి. ఈసారి కూడా భారత్‌కు కివీస్ నుంచి కఠిన సవాల్ తప్పదు. ఆ జట్టులోని ప్రధాన బ్యాటర్లు డేవన్ కాన్వే, టామ్ లేథమ్, కేన్ విలియమ్సన్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ మంచి ఫామ్‌లో ఉన్నారు. తాజాగా పాక్, దక్షిణాఫ్రికాతో జరిగిన ముక్కోణపు సిరీస్‌ను కివీస్ సొంతం చేసుకుంది. ఫైనల్‌లో పాక్‌ను ఓడించింది. అయితే, ప్రధాన పేసర్లు టిమ్ సౌథీ, ట్రెంట్ బౌల్ట్, లాకీ ఫెర్గూసన్ లేకుండానే ఆడనున్న నేపథ్యంలో పేస్ విభాగం కాస్త బలహీనంగానే ఉంది. ఆ జట్టు కెప్టెన్ మిచెల్ సాంట్నర్ నుంచి టీమ్‌ఇండియాకు ప్రమాదం తప్పదు. గతేడాది భారత్ పిచ్‌లపైనే సాంట్నర్ విజృంభించిన సంగతి తెలిసిందే. ఇక ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర తలకు బలమైన గాయం కారణంగా అతడి రాకపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. కివీస్ బౌలింగ్‌తో పోలిస్తే బ్యాటింగ్ బలంగా ఉంది. ఇది టీమ్‌ఇండియా బౌలింగ్‌కు పరీక్ష ఎదురుకానుంది. చివరిగా..: ఎలాంటి సమస్యలు లేకుండా సెమీస్‌కు చేరుకోవాలంటే భారత్ మూడు మ్యాచుల్లోనూ గెలవాలి. అలా కాకుండా, ఏమాత్రం ఒక్క అడుగు పొరపాటున పడినా.. గ్రూప్ స్టేజ్‌ను దాటడమూ కష్టమే అవుతుంది. ఆసియా కప్ 2022లో గ్రూప్ స్టేజ్‌లో భారత్ ఒకే ఒక్క మ్యాచ్‌ను గెలిచింది. దీంతో సెమీస్‌కు కూడా చేరలేక విమర్శలను ఎదుర్కొన్న సంగతిని గుర్తుంచుకోవాలి.



## భారత్‌దే ట్రోఫీ.. టాప్ స్కోరర్‌గా రోహిత్ ఆసీస్ మాజీ కెప్టెన్

ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా టీమ్‌ఇండియా నిలుస్తుందని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకెల్ క్లార్క్ జోస్యం చెప్పాడు. అలాగే భారత కెప్టెన్ రోహిత్ శర్మ అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలుస్తాడని క్లార్క్ వ్యాఖ్యానించాడు. ఒక్కసారి అతడు కుదురుకుంటే ఆపడం ఎవరి వల్లా కాదని.. తాజాగా ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఫామ్ అందుకోవడం టీమ్‌ఇండియాకు కలిసొచ్చే అంశమని స్పష్టం చేశాడు. ''భారతే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలవబోతుందని చెబుతున్నా. సారథి రోహిత్ శర్మ మళ్లీ ఫామ్‌లోకి రావడం బాగుంది. అందుకే, టీమ్‌ఇండియా టైటిల్‌ను సొంతం చేసుకోగలదని భావిస్తున్నా. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించే బ్యాటర్‌గానూ నిలుస్తాడు. ఇక టాప్ వికెట్ టేకర్‌గా జోఫ్రా ఆర్చర్ అవుతాడనుకుంటున్నా. జట్టుపరంగా ఇంగ్లండ్‌కు టైటిల్ అవకాశాలు తక్కువే. కానీ, ఆ జట్టులో అతడే సూపర్ స్టార్. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ట్రావిస్ హెడ్ నిలుస్తాడనుకుంటున్నా. ఐపీఎల్ ఫామ్ కొనసాగిస్తాడని ఆశిస్తున్నా. గత వన్డే ప్రపంచ కప్‌లోనూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు'' అని క్లార్క్ వెల్లడించాడు.

**గేల్ రికార్డుపై విరాట్ గురి**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగుతోన్న విరాట్ కోహ్లి ముంగిట ఓ రికార్డు ఉంది. అదీనూ యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ రికార్డు కావడం గమనార్హం. ఇప్పటి వరకు ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో విరాట్ కోహ్లి 13 మ్యాచుల్లో 529 పరుగులు చేశాడు. కెరీర్‌లో ఇదే చివరి ఛాంపియన్స్ ట్రోఫీగా భావిస్తోన్న విరాట్ మరో 263 పరుగులు చేస్తే.. టోర్నీలోనే అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అవతరిస్తాడు. ప్రస్తుతం క్రిస్ గేల్ (791) అందరి కంటే ముందున్నాడు. ఈ జాబితాలో శిఖర్ ధావన్ (701) మూడో స్థానంలో ఉన్నాడు. ఫిబ్రవరి 19 నుంచి టోర్నీ ప్రారంభం కానుండగా.. భారత్ తన తొలి మ్యాచ్‌లో ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో తలపడనుంది. ఫిబ్రవరి 23న పాక్‌తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో భారత్ ఆడనుంది.



## వ్యక్తిగత చెఫ్ లేడు..

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్‌ఇండియా ఇప్పటికే దుబాయ్‌కు చేరుకుంది. ప్రాక్టీస్ కూడా ముమ్మరం చేసింది. విరాట్, రోహిత్‌తోపాటు ఇతర క్రికెటర్లూ నెట్స్‌లో ఎక్కువగా సాధన చేశారు. బీసీసీఐ పది ఆదేశాల మేరకు ఆటగాళ్ల కుటుంబ సభ్యులకు అనుమతి ఇవ్వలేదు. అలాగే వ్యక్తిగత చెఫ్‌నూ పెట్టుకొనేందుకు వీల్లేకుండా పోయింది. జట్టుకు బోర్డు నుంచి ప్రత్యేకంగా ఓ చెఫ్‌ను కేటాయించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, డైట్ విషయంలో కఠినంగా ఉండే భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి తనకిష్టమైన ఆహారం కోసం ఓ మార్గం కనిపెట్టినట్లు తెలుస్తోంది. ఆదివారం ప్రాక్టీస్‌కు వచ్చిన కాసేపటికే.. వేదిక వద్దకు కోహ్లికి ఫుడ్ డెలివరీ అయింది. ప్యాకెట్ల రూపంలో ఉన్నవి బ్యాటర్‌కు అందాయి. ప్రత్యేకంగా చెఫ్ లేకపోవడంతో లోకల్ టీమ్ మేనేజర్‌కు చెప్పి తనకు కావాల్సిన వాటిని తెప్పించుకున్నాడు. ఎలా చేయాలి? ఎలా ఉండాలనే దాని గురించి పూర్తిగా వివరించినట్లు సమాచారం. దీంతో సదరు మేనేజర్ వెంటనే ప్రసిద్ధిగాంచిన ఫుడ్ పాయింట్ నుంచి ప్యాకెట్లను తెచ్చి కోహ్లికి అందించాడు. ''ప్రాక్టీస్ సెషన్ అనంతరం కోహ్లి తినేందుకు కొన్ని ఆహార పొట్లాలను ఇచ్చారు. ఇతర క్రికెటర్లు తమ కిట్‌లను సర్దుకుంటూ ఉండగానే.. కోహ్లి మాత్రం అక్కడే తన భోజనం పూర్తి చేశాడు. ప్రయాణంలోనూ తినేందుకు మరికొన్ని బాక్స్‌లను దాచుకున్నాడు'' అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

## అలా కొడితే బౌండరీయే అన్న రోహిత్..



ఇంగ్లండ్‌ను వన్డే సిరీస్‌లో వైట్ వాష్ చేసి టీమ్‌ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ లోకి మరింత ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టింది. గత శనివారం దుబాయ్‌కు భారత జట్టు చేరుకుంది. బంగ్లాదేశ్‌తో తొలి మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఆటగాళ్లు నెట్స్‌లో తీవ్రంగా సాధన చేస్తున్నారు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, షమీ తదితరులు ప్రాక్టీస్ చేశారు. ఈ సమయంలో ఆటగాళ్లు, కోచింగ్ స్టాఫ్ ఎంతో ఉత్సాహంగా కనిపించారు. మధ్య మధ్యలో ఆటగాళ్లు జోకులు వేసుకుంటూ సరదా సంభాషణలు కొనసాగించారు. 'అంచనా వేసి బంతిని ఆడండి.. కవర్ ఫీల్డర్‌ను అధిగమిస్తే అది బౌండరీయే' అని రోహిత్ శర్మ అనగా కెమెరాలు అతడివైపు తిరిగాయి. ఆ తర్వాత హార్దిక్.. రవీంద్ర జడేజాతో గుజరాతీలో ఏదో మాట్లాడుతూ కనిపించాడు. అనంతరం రోహిత్ టెన్నిస్ బాల్‌తో క్యాచ్‌ల ప్రాక్టీస్ సెషన్ నిర్వహించగా.. ఆటగాళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసిన హార్దిక్ పాండ్య తనలో తాను మాట్లాడుకోవడం నవ్వులు తెప్పించింది. బంతిని అంచనా వేయడంలో తప్పు చేసినట్లు గ్రహించిన హార్దిక్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ''బంతి బ్యాట్ బాటమ్ పార్ట్‌ను తాకింది. కొట్టాలనుకుంటే కొట్టు'' అని తనలో తాను మాట్లాడుకున్నాడు. ఇక గిల్ పక్కనే బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసిన కోహ్లి.. 'ఆటను ఎంజాయ్ చేయ్' అని అన్నాడు. మరోవైపు వాషింగ్టన్ సుందర్‌కు సలహాలు ఇస్తూ హార్దిక్ కనిపించాడు. ఆ తర్వాత కెమెరాలు 'షాట్ ఆఫ్ ది డే'ను క్యాప్చర్ చేశాయి. అది కొట్టింది ఎవరో కాదు.. హర్షిత్ రాణా. బంతి చాలా దూరం వెళ్లడంతో.. రిషభ్ పంత్ 'క్యా షాట్ హై' అంటూ ప్రశంసించాడు. అయితే.. బ్యాటింగ్ కోచ్ నాయర్ మాత్రం కాస్త దూకుడు తగ్గించాలని రాణాకు సూచించాడు.

## ప్రాక్టీస్‌లో పంత్‌కు గాయం

**దుబాయ్:** ఛాంపియన్స్ ట్రోఫీ కోసం దుబాయ్‌కి చేరుకున్న టీమ్‌ఇండియా.. ఆలస్యం చేయకుండా ప్రాక్టీస్ మొదలుపెట్టింది. శనివారం సాయంత్రమే దుబాయ్‌లో అడుగు పెట్టిన రోహిత్ సేన.. తర్వాతి రోజు ఉదయం ఐసీసీ అకాడమీలో సాధన చేసింది. అయితే ప్రాక్టీస్ సందర్భంగా భారత్‌కు ఇబ్బంది తలెత్తింది. నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య కొట్టిన షాట్‌కు.. దగ్గర్లో ఉన్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ గాయపడ్డాడు. బంతి బలంగా అతడికి మోకాలిని తాకడంతో బాధతో విలవిలలాడుతూ పంత్ కింద పడుకున్నాడు. అతడికి ఫిజియో చికిత్స చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమంలోకి వచ్చింది. రెండేళ్ల కిందట పంత్ రోడ్డు ప్రమాదానికి గురైనపుడు మోకాలికి తీవ్ర గాయం కావడం, శస్త్రచికిత్సలు జరగడం తెలిసిందే. ఆ మోకాలికే బంతి తాకినట్లు సమాచారం. అయితే గాయం తీవ్రమైందేమీ కాదని, పంత్ కోలుకున్నాడని జట్టు వర్గాలు తెలిపాయి. పంత్ ఛాంపియన్స్ ట్రోఫీకి ప్రత్యామ్నాయ వికెట్ కీపర్. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో వికెట్ కీపింగ్ చేసిన కేఎల్ రాహులే.. ఛాంపియన్స్ ట్రోఫీలోనూ తుది జట్టులో ఆడే అవకాశముంది. పంత్ ఇంగ్లాండ్ సిరీస్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇదిలా ఉంటే.. ఆదివారం టీమ్‌ఇండియా ప్రాక్టీస్ బాగానే సాగింది. కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సహా జట్టంతా సాధన చేసింది. బ్యాటర్ల కంటే ముందు బౌలర్లు నెట్స్‌కు వచ్చారు. ఇటీవలే జట్టులోకి పునరాగమనం చేసిన మహ్మద్ షమి.. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌తో పర్యవేక్షణలో బౌలింగ్ లెంగ్త్‌ల మీద దృష్టిసారించాడు. రోహిత్, కోహ్లి ఎక్కువ సమయమే బ్యాటింగ్ సాధన చేశారు. ఛాంపియన్స్ ట్రోఫీ బుధవారం ఆరంభం కానుండగా.. భారత్ తన తొలి మ్యాచ్‌ను గురువారం బంగ్లాదేశ్‌తో ఆడుతుంది. టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తున్నప్పటికీ.. టీమ్‌ఇండియా తన మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది.



## మా టీమ్‌కు అంత సీన్ లేదు.. సెమీస్‌కు చేరితేనే గొప్ప..

స్వదేశం ఆతిథ్యం ఇస్తోన్న ఛాంపియన్స్ ట్రోఫీని తమ జట్టు గెలవడం కష్టమేనని.. అసలు ఆ అర్హత లేదని పాక్ మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. 1996 వన్డే ప్రపంచ కప్ తర్వాత ఇప్పటి వరకు పీసీబీ మరో ఐసీసీ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వలేకపోయింది. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీకి హోస్ట్‌గా మారింది. కరాచీ వేదికగా పాకిస్థాన్ న్యూజిలాండ్ మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభం కానుంది. అయితే, డిఫెండింగ్ ఛాంపియన్ పాక్‌ను హాట్ ఫేవరెట్‌గా భావిస్తుంటే.. ఆ జట్టు మాజీ క్రికెటర్ మాత్రం నమ్మకం లేదనడం గమనార్హం. ''దేశం గర్వపడే అద్భుతమైన క్షణాలు ఇవే. మేం చివరిసారిగా 1996లో వన్డే ప్రపంచ కప్‌కు ఆతిథ్యం ఇచ్చాం. ఇప్పుడు అవకాశం వచ్చింది. దీనిని విజయవంతంగా నిర్వహించగలిగితే భవిష్యత్తులో మరిన్ని ఐసీసీ టోర్నీలకు ఆతిథ్యం ఇచ్చే ఛాన్స్ దక్కుతుంది. టోర్నీ ముగిసేటప్పుడు ప్రతి జట్టును మా ఆతిథ్యం గురించి అడగాలి. వారిచ్చే ఫీడ్‌బ్యాక్ అత్యంత కీలకం. గత నాలుగైదు నెలలుగా దీని కోసం మేం చాలా కష్టపడ్డాం. ఛాంపియన్స్ ట్రోఫీకి అసలు ఆతిథ్యం ఇవ్వగలదా? లేదా? అనే చర్చ చాలా జరిగింది. వాటన్నింటినీ దాటుకొని టోర్నీని ప్రారంభించబోతున్నాం. భారత్ ఇక్కడికి రానందుకు బాధగానే ఉంది. అయితే, ద్వైపాక్షిక విషయాలు చాలా సున్నితమైనవి. ఇక ఛాంపియన్స్ ట్రోఫీని ఎవరు గెలుస్తారనేది ఇప్పుడే చెప్పలేం. అయితే, మా జట్టుకు అవకాశాలు తక్కువే. చాలా లోపాలు ఉన్నాయి. బౌలింగ్‌లో ఇబ్బందులు. నాణ్యమైన స్పిన్నర్లు లేరు. బ్యాటింగ్‌లోనూ సమస్యలు. ఇలా చాలా ఉన్నాయి. ఇంకాస్త ఉత్తమంగా జట్టును ఎంపిక చేయాల్సి ఉంది. ఇక సెమీస్‌కు భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ వస్తాయని అంచనా వేస్తున్నా. పాకిస్థాన్ సెమీస్‌కు చేరితే పెద్ద అచీవ్‌మెంట్. టైటిల్ గెలిచే అర్హతే లేదనిపిస్తోంది'' అని కమ్రాన్ వ్యాఖ్యానించాడు.

**అందుకైనా మా జట్టు న్యాయం చేయాలి: యూసఫ్**

''ఐసీసీ ఈవెంట్‌కు అతిథ్యం ఇచ్చేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చాలా శ్రమించింది. స్టేడియాలను ఆధునీకీకరణ చేసేందుకు భారీగా ఖర్చు పెట్టింది. పీసీబీ కష్టానికైనా న్యాయం చేసేందుకు జట్టు నాణ్యమైన క్రికెట్ ఆడాలి. కేవలం ఆరు నెలల్లోనే మైదానాలను సిద్ధం చేసిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి'' అని పాక్ మాజీ కెప్టెన్ మహమ్మద్ యూసఫ్ సూచించాడు.

## బుమ్రా లేకపోయినా.. ఆ ఆటగాడి నుంచి బంగ్లాకు పెద్ద ముప్పు..



ఛాంపియన్స్ ట్రోఫీ లో బంగ్లాదేశ్‌తో తొలి మ్యాచ్ ఆడేందుకు టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. దుబాయ్ వేదికగా జరిగే ఈ మ్యాచ్ కోసం అటు బంగ్లా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే దుబాయ్ చేరుకున్న టీమ్‌ఇండియా ప్రాక్టీస్‌పై దృష్టిపెట్టింది. ఈ మ్యాచ్‌పై బంగ్లా మాజీ ఓపెనర్ ఇమ్రూల్ కయేస్ స్పందించాడు. స్టార్ పేసర్ బుమ్రా టీమ్‌ఇండియా జట్టులో లేకపోవడాన్ని సద్వినియోగం చేసుకోవాలని బంగ్లా జట్టుకు సూచించాడు. మరోవైపు బుమ్రా లేకపోయినా.. మరో రూపంలో ముప్పు పొంచి ఉందని జట్టును హెచ్చరించాడు. ''టీమ్‌ఇండియా ఎంతో బలమైన జట్టు. దాని బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలు ఎంతో పటిష్టంగా ఉన్నాయి. అయితే.. జట్టులో బుమ్రా లేడు. అతడు గత రెండేళ్లలో టీమ్‌ఇండియాకు ఎంత గొప్ప ప్రదర్శన చేశాడో చూశాం. అతడు లేకపోవడం బంగ్లా జట్టుకు కలిసొచ్చే విషయమే'' ''బుమ్రా లేకపోయినా.. ఆ జట్టులో మహమ్మద్ షమీ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్ ఉన్నారు. షమీ జట్టులోకి రావడం పెద్ద పరిణామం. అతడు ప్రస్తుతం ఫిట్‌నెస్‌తో కాస్త ఇబ్బంది పడుతున్నాడు. అయితే.. ఒక్కసారి బంతితో లయను అందుకుంటే, అతడు బంగ్లాకు పెద్ద ముప్పుగా మారతాడు'' అని జట్టు సభ్యులను ఇమ్రుల్ హెచ్చరించాడు. ఇక బంగ్లా జట్టులో వెటరన్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ లేకపోవడం ఇబ్బందికర విషయమేనని ఇమ్రుల్ అంగీకరించాడు. ''షకీబ్ గొప్ప ఆటగాడు. అతడిని మేం మిస్ అవుతున్నాం. ఏ మ్యాచ్‌లోనైనా అతడు ప్రభావం చూపిస్తాడు'' అని పేర్కొన్నాడు. దుబాయ్ వేదికగా భారత్‌బంగ్లా మధ్య తొలి మ్యాచ్ ఈ నెల 20న జరగనుంది. ఈ మ్యాచ్‌లో భారతే ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. ఆ తర్వాత చిరకాల ప్రత్యర్థి అయిన పాకిస్థాన్‌తో భారత్ 23న తలపడనుంది.

## ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు మరో వివాదం.. కనిపించని భారత్ జెండా!

పాకిస్థాన్ ఆతిథ్యంలో జరిగే ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీకి అంతా సిద్ధమైంది. ఈ టోర్నీ కోసం దాయాది దేశంలో పర్యటించేది లేదని తేల్చి చెప్పిన నేపథ్యంలో.. టీమ్‌ఇండియా ఆడే మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్న విషయం తెలిసిందే. ట్రోఫీ ఆరంభానికి ఇంకా రెండు రోజులే సమయమున్న నేపథ్యంలో కరాచీ స్టేడియంలో చోటుచేసుకున్న ఓ ఘటన తాజా వివాదానికి దారితీసింది. ఈ స్టేడియంలో అన్ని జట్ల జాతీయజెండాలను ప్రదర్శించగా.. అందులో భారతదేశ పతాకం లేకపోవడం గమనార్హం. దీనికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే.. ఇది ఎంత వరకు వాస్తవమో తెలియాల్సి ఉంది. మరోవైపు ఇరు జట్ల బోర్డుల నుంచి ఎలాంటి స్పందన లేదు. భారత దేశ జెండా ఆ స్టేడియంలో ప్రదర్శించకపోవడానికి గల కారణాలేంటో తెలియరాలేదు. కరాచీ స్టేడియం వేదికగా.. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, ఇంగ్లండ్ జట్ల మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే.. ఈ టోర్నీలో పాల్గొనే అన్ని దేశాల జెండాలు



ప్రదర్శించాల్సినచోట భారత జాతీయజెండా లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాక్ క్రికెట్ బోర్డు ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకుందని పలువురు అభిమానులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు పాకిస్థాన్ గడ్డపై ఆడేందుకు విముఖత చూపించినందుకు భారత ఆటగాళ్లను ఎవరూ హగ్ చేసుకోవద్దని తమ క్రికెటర్లను అభిమానులు ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈమేరకు పాక్ జర్నలిస్ట్ ఒకరు తన సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేశారు. పాకిస్థాన్‌లో ఆడేది లేదని టీమ్‌ఇండియా తేల్చి చెప్పడంతో.. ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌కు మార్చిన విషయం తెలిసిందే. భారత్ ఆడే మ్యాచ్‌లకు దుబాయ్ వేదిక కానుంది. ఒకవేళ భారత్ లీగ్ దశ నుంచి సెమీస్, ఫైనల్‌కు చేరితే.. ఆ మ్యాచ్‌లు కూడా అక్కడే జరగనున్నాయి. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్‌పాక్ మ్యాచ్ ఈనెల 23న దుబాయ్ వేదికగా జరగనుంది.



# అలియా ఘనత..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియాభట్ మరోసారి ఘనతను సాధించారు. ఇన్‌స్టాలో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన నటీమణుల జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్ హైప్ ఆడిటర్ తాజాగా విడుదల చేసిన నివేదికలో అలియా రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జెన్నిఫర్ లోపెజ్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలను వెనక్కినెట్టి అలియా టాప్‌లో ఉండడం విశేషం. దీంతో అలియా సినీరంగంలో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు చెబుతున్నారు. సోషల్ మీడియాలో ఈ స్టార్ హీరోయిన్‌కు ఉన్న ఫాలోయింగ్ తెలిసిందే. ఇన్‌స్టాలో ఈ బ్యూటీని ఏకంగా 8 కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారు. ఎప్పుడూ తన సినిమా విశేషాలతో పాటు వ్యక్తిగత విషయాలను కూడా అలియా అభిమానులతో పంచుకుంటుంటారు. ఫొటోషూట్‌లతో నిత్యం ఆకట్టుకుంటుంటారు. ఇక అలియా గతేడాది కూడా టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన '100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఆఫ్ 2024' (ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు) జాబితాలో చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. చివరిసారి 'జిగ్రా'తో అలియా పలకరించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రం మిశ్రమ ఫలితాలకు పరిమితమైంది. కొన్ని రోజులుగా ఈమెకు సంబంధించిన పలు వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్ హనురాఘవపూడి కాంబినేషన్‌లో రానున్న సినిమాలో అలియా యువరాణి పాత్రలో మెరవనున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే టాలెంటెడ్ దర్శకుడు నాగ్ అశ్విన్ సినిమాలోనూ ఆమె నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.



# ప్రశాంత్‌నీల్-ఎన్టీఆర్ సినిమా.. జోరుగా చిత్రీకరణ సన్నాహాలు

కథానాయకుడు ఎన్టీఆర్.. దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందనుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా వచ్చే వారం నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు తెలిసింది. అయితే ఈ తొలి షెడ్యూల్‌లో తారక్ లేని సన్నివేశాల్ని చిత్రీకరించనున్నారని.. మార్చి నుంచి ఆయన ఈ చిత్ర సెట్స్‌లోకి అడుగు పెడతారని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో ఓల్డ్ కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో ఓ ప్రత్యేక సెట్‌ను సిద్ధం చేస్తున్నారు. అందులోనే ఈ చిత్ర రెండో షెడ్యూల్ మొదలు కానుంది. ఈ పీరియాడిక్ మాస్ యాక్షన్ డ్రామాలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ కనిపించనుంది. మలయాళ యువ హీరో టొవినో థామస్ కీలక పాత్రలో సందడి చేయనున్నట్లు తెలిసింది. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి రవి బస్రూర్ సంగీతమందిస్తుండగా.. భువన గౌడ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించనున్నారు.

# 'జటాధర' మొదలైంది



సుధీర్‌బాబు కథానాయకుడిగా వెంకట్ కల్యాణ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జటాధర'. జీ స్టూడియో సమర్పణలో ఉమేశ్ కె.ఆర్.భన్సాల్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా శనివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి హరీశ్ శంకర్ క్లాప్ కొట్టారు. వెంకీ అట్లూరి, మోహనకృష్ణ ఇంద్రగంటి, వై.రవిశంకర్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత కేఆర్ భన్సాల్ మాట్లాడుతూ.. "అనంత పద్మనాభ స్వామి ఆలయం చుట్టూ తిరిగే కథ ఇది. అక్కడి సంపద, దాని చుట్టూ అల్లుకున్న వివాదాలు, పురాణ చరిత్ర.. ఇలా అన్నింటినీ దీంట్లో చూపించనున్నాం'' అన్నారు.

# 'తండేల్' మరో మైల్‌స్టోన్.. నాగచైతన్యకు బిగ్గెస్ట్ హిట్..

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా, చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'తండేల్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. అంతేకాదు, వసూళ్ల విషయంలోనూ రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పుడు ఈ చిత్రం మరో రికార్డును సొంతం చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. అంతేకాదు, నాగచైతన్య సినీ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ మూవీగా నిలిచింది.

**ఆ ఇబ్బందులను దాటుకుని..**

విడుదలైన రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న ఈ మూవీ పైరసీ బారిన పడింది. అత్యంత నాణ్యమైన ప్రింట్ ఆన్‌లైన్ అందుబాటులోకి రావడం, ఆర్టీసీ బస్సులోనూ ప్రదర్శించడంపై చిత్ర బృందం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పైరసీకి పాల్పడుతున్న వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లో విడిచి పెట్టేది లేదని నిర్మాతలు బన్నీ వాసు, అల్లు అరవింద్ పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొని 'తండేల్' బాక్సాఫీస్ వద్ద బలంగా నిలబడింది. ముఖ్యంగా నాగచైతన్య, సాయిపల్లవిల నటన, చందూ మొండేటి టేకింగ్ సినిమాకు బలాన్ని ఇచ్చాయి. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ మరోస్థాయికి తీసుకెళ్లింది. యువత సినిమాను థియేటర్‌లో చూసేందుకు ఆసక్తిక కనబరచడం కూడా కలిసొచ్చింది. ఇక ఓవర్సీస్‌లోనూ 'తండేల్' అదరగొడుతోంది. ఇప్పటికే 1 మిలియన్ డాలర్ల కలెక్షన్లు దాటేయగా, ఇప్పుడు రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఇదే విషయాన్ని నిర్మాత బన్ని వాస్ చెబుతూ 'మేము వాగ్దానం చేశాం.. నిలబెట్టుకున్నాం' అని ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. సినిమా విడుదలై 10 రోజులు అవుతున్నా, బుక్‌మై షోలో టికెట్లు బాగానే విక్రయమవుతున్నట్లు ట్రేడ్‌వర్గాలు చెబుతున్నాయి.





# భాగ్యశ్రీ బోర్సేకి మరో బంపర్ ఆఫర్...

'మిస్టర్ బచ్చన్'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి తన డ్యాన్స్‌తో ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఆ సినిమా తర్వాత ఈ బ్యూటీ వరుస ఆఫర్లు అందుకుంటూ అలరించేందుకు సిద్ధమయ్యారు. తాజాగా భాగ్యశ్రీ ఓ బంపర్ ఆఫర్ అందుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. తమిళ స్టార్ హీరో సూర్య సరసన ఓ సినిమాలో నటించనున్నట్లు కోలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా రానున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా భాగ్యశ్రీని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఆమెతో చర్చలు జరిపారని ఈ ప్రాజెక్ట్‌కు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఈ ఏడాది మే నెలలో దీని షూటింగ్ ప్రారంభించనున్నారట. సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఈ సినిమా రానుందని జీవీ ప్రకాశ్ దీనికి సంగీతం అందించనున్నట్లు సినీ వర్గాల సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే రానున్నరోజుల్లో భాగ్యశ్రీ బిజీ హీరోయిన్‌గా మారడం ఖాయమంటున్నారు అభిమానులు. ఇప్పటికే భాగ్యశ్రీ చేతిలో వరుస సినిమాలు ఉన్నాయి. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'కాంత'. ఇందులో దుల్కర్ సరసన భాగ్యశ్రీ కనిపించనున్నారు. రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మాతలు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. మహేశ్ దర్శకత్వంలో యంగ్ హీరో రామ్ పోతినేని నటిస్తున్న చిత్రంలోనూ భాగ్యశ్రీ నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. వీటితో పాటు విజయ్ దేవరకొండ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో రానున్న 'కింగ్‌డమ్'లో ఈమెను ఎంపిక చేసినట్లు సమాచారం.

# తెలుగు సినిమా సెట్‌లో ఎగతాళి.. ఎంతో బాధపడ్డా: శ్వేతాబసు ప్రసాద్



'కొత్తబంగారు లోకం' సినిమాతో కుర్రకారును మైమరపించేసి వారి హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నారు నటి శ్వేతాబసు ప్రసాద్. కొన్నేళ్లుగా ఆమె టాలీవుడ్‌కు దూరంగా ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన కెరీర్ గురించి మాట్లాడారు. ఓ తెలుగు సినిమా సెట్‌లో తాను అవమానాలు ఎదుర్కొన్నానని అన్నారు. సెట్‌లో ఉన్న ప్రతిఒక్కరూ శరీరాకృతి విషయంలో తనని ఎగతాళి చేశారని చెప్పారు. ఆ సమయంలో తాను ఎంతో బాధపడ్డానని చెప్పారు. "కెరీర్ విషయంలో నేను సంతృప్తిగానే ఉన్నా. నాకు నచ్చిన సినిమాలు చేశాను. ప్రస్తుతం టెలివిజన్ ఇండస్ట్రీలో రాణిస్తున్నాను. కెరీర్ పరంగా ఇబ్బందిపడిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా ఒక తెలుగు సినిమా సెట్‌లో చాలా ఇబ్బందిపడ్డా. హీరోతో పోలిస్తే నేను ఎత్తు తక్కువగా ఉన్నానని సెట్‌లో ఉన్న ప్రతిఒక్కరూ నన్ను ఎగతాళి చేసేవారు. హీరో ఆరడుగులు ఉంటే ఈవిడేమో 5 అడుగులు ఉందని అనేవారు. ఇక, హీరోతో వచ్చిన సమస్య మరో స్థాయిలో ఉండేది. అతను ప్రతి సన్నివేశాన్ని మార్చేస్తుండేవాడు. గందరగోళానికి గురి చేసేవాడు. రీటేక్స్ ఎక్కువగా తీసుకునేవాడు. తెలుగులో డైలాగ్స్ చెప్పలేకపోయేవాడు. నిజం చెప్పాలంటే నాక్కూడా తెలుగు సరిగ్గా రాదు. కానీ, నేను ఏదోఒకరకంగా డైలాగ్స్ నేర్చుకొని షూట్‌లో నెట్టుకొచ్చేదాన్ని. అతను మాత్రం అలా కాదు. మాతృభాష తెలుగే అయినప్పటికీ అతనికి భాషపై కంట్రోల్ లేదు కానీ, నన్ను మాత్రం నా కంట్రోల్‌లో లేని నా ఎత్తు గురించి కామెంట్ చేసేవాడు. ఎత్తు అనేది వారసత్వంగా వస్తుంది కదా. దానికి నేనేం చేసేది. నాకు తెలిసి నేను అంత బాధపడిన సెట్ ఏదైనా ఉందంటే అదే'' అని శ్వేతా బసు ప్రసాద్ అన్నారు. 11 ఏళ్ల వయసుకే బాలనటిగా కెరీర్ ఆరంభించారు నటి శ్వేతా బసు ప్రసాద్. 'మక్డీ' అనే మూవీలో ఆమె నటించారు. 2008లో తెరకెక్కిన 'కొత్తబంగారు లోకం'తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా విజయం తర్వాత 'రైడ్', 'కాస్కో', 'కళవర్ కింగ్', 'ప్రియుడు', 'జీనియస్' వంటి చిత్రాల్లో యాక్ట్ చేశారు. 2018లో విడుదలైన 'విజేత' తర్వాత ఆమె తెలుగు సినిమాల్లో యాక్ట్ చేసిన సందర్భాల్లేవు. ప్రస్తుతం హిందీ సినిమాలు, సీరియల్స్‌లో ఆమె నటిస్తున్నారు.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896